RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 114 మంగళవారం 20 మే 2025 పేజీలు : 4

## గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో 103 మంది మృతి

గాజా : పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను తీవ్రతరం చేసింది. గాజా స్ట్రిప్ వ్యాప్తంగా రాత్రి నుంచి ఉదయం వరకు జరిపిన వైమానిక దాడుల్లో 103 మంది మరణించారు. ఉత్తర గాజాలోని ప్రధాన ఆస్పత్రిని సైతం మూసివేశారు. ఇజ్రాయెల్ సూచించిన షరతుల మేరకు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందానికి హమాస్ ఒప్పుకొనేలా ఒత్తిడి పెంచే ప్రణాళికలో భాగమే తాజా భీకర దాడులు. ఖాన్‌యూనిస్ నగరంలోనూ, దాని చుట్టుపక్కల జరిపిన దాడుల్లో ఇళ్లు, పునరావాస టెంట్‌లు ధ్వంసమవడంతో 48 మందికిపైగా మరణించారు. మృతుల్లో 18 మంది చిన్నారులు, 13 మంది మహిళలు ఉన్నారని నస్సెర్ ఆస్పత్రి అధికార ప్రతినిధి వీం ఫేర్స్ చెప్పారు.

# పగబట్టిన పెద్దన్న..

## భారత్‌కు ట్రంప్ షాక్ మీద షాక్ లు..

## శత్రు దేశాలతో కలిసి బిగ్ స్కెచ్..?



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రస్తుతం అనుసరిస్తున్న తీరుపై ప్రపంచ దేశాలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా భారత్ పై ట్రంప్ పగబట్టినట్లు కనిపిస్తోంది. ఇందుకు గత కొన్ని రోజులుగా ఆయన వ్యవహరిస్తున్న తీరే సాక్ష్యం. అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న భారత్ లాంటి దేశాలకు సహకారం అందించాల్సింది పోయి ప్రపంచ దేశాల ముందు భారత్ ను కావాలనే తక్కువ చేసి మాట్లాడటం.. పాకిస్థాన్ లాంటి ఉగ్ర దేశంతో పోల్చడం ఇటు భారతీయులకు అటు ప్రపంచ దేశాలకు మింగుడు పడటం లేదు. పహల్గాం ఉగ్రదాడితో ఉలిక్కి పడ్డ భారత్ కు ప్రపంచ దేశాలు సానుభూతి తెలిపాయి. ఉగ్రవాదాన్ని అణచివేయాలని పిలుపునిచ్చాయి. పాకిస్థాన్ వైఖరిని తీవ్రంగా ఖండించాయి. కానీ పెద్దన్నగా చెప్పుకునే ట్రంప్ మాత్రం ఆశించినంత స్థాయిలో స్పందించలేదు. కానీ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ మొదలైనప్పటి నుంచే భారత్- పాక్ చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని శ్వేతసౌధం నుంచి ప్రకటనలు వెలువడటం గమనార్హం. అంతేకాక భారత్- పాకిస్థాన్ మధ్య మధ్యవర్తిత్వం చేసి యుద్ధం ఆపేశానని.. యుద్ధం ఆగిపోవడానికి తానే కారణం అని చెప్పుకొచ్చారు ట్రంప్. గల్ఫ్ దేశాల్లో ఇటీవల పర్యటించిన ట్రంప్ అక్కడ కూడా ఇదే పాట పాడారు. అంతేకాక ప్రపంచ దేశాల ముందు భారత్ ను తక్కువ చేసి మాట్లాడారు. తనకు భారత్- పాకిస్థాన్ రెండూ మిత్ర దేశాలనీ..ఇరు దేశాలతో సత్సంబంధాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. దీంతో పాకిస్థాన్ లాంటి ఉగ్రదేశంతో భారత్ ను పోల్చడం ఏంటని యావత్ భారతావని నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. మరోవైపు పాకిస్థాన్కు యుద్ధంలో టర్కీ సపోర్ట్ చేసిన విషయం తెలిసిందే. టర్కీ నుంచి భారీగా డ్రోన్లు, ఇతర ఆయుధాలను పాకిస్థాన్ సరఫరా చేసకుంది. ఇప్పుడు ట్రంప్ ఆ దేశానికి సాయం చేస్తున్నారు. 225 మిలియన్ డాలర్ల విలువైన AMRAAM మిస్సైల్స్ ను టర్కీకి ఇచ్చేందుకు అమెరికా సిద్ధమైంది. అంతేకాక 79.1 మిలియన్ డాలర్ల 60 బ్లాక్- 2 క్షిపణులను కూడా టర్కీకి అందించనుంది అమెరికా. ఇదే క్రమంలో పాకిస్థాన్ కు అన్నివైపులా టర్కీ అండగా నిలుస్తోంది. ఈ క్రమంలో ట్రంప్ వైఖరిపై భారత్ లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డొనాల్డ్ ట్రంప్ ఇటీవల సౌదీ అరేబియా పర్యటన చేపట్టిన విషయం తెలిసిందే.

అయితే అక్కడ నిర్వహించిన ఓ ప్రెస్ మీట్ లో ట్రంప్ వివాదాస్పదంగా మాట్లాడారు. భారత ఆర్థిక, వాణిజ్య వ్యవస్థను దెబ్బతీసేలా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యవహరించారు. భారత్ లో యాపిల్ సంస్థ పెట్టుబడులు పెట్టడం, యాపిల్ ఫోన్లను తయారు చేయడం తనకు ఇష్టం లేదని ట్రంప్ అన్నారు. ఈ వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. ఇది మరువక ముందే భారత్ నుంచి అమెరికాకు వెళ్లిన 15 మామిడి పండ్ల షిప్ మెంట్ లను అక్కడి అధికారులు.. సరైన పత్రాలు లేవనే కారణంగా అడ్డుకున్నారు. వీటి విలువ 5 లక్షల అమెరికా డాలర్లు ఉంటుందని సమాచారం. ఇది భారతీయ కరెన్సీలో 4 కోట్లుగా ఉంది. దీంతో వీటిని తిరిగి భారత్ కు తీసుకెళ్లిపోవడం లేదా అక్కడే ధ్వంసం చేయాల్సిన పరిస్థితి రైతులకు ఎదురైంది. ఇలా భారత్ కు ట్రంప్ షాక్ మీద షాక్ లు ఇస్తున్నారు. ప్రస్తుతం అమెరికా, చైనా దేశాలు ప్రపంచంలో అగ్రగామిగా ఉన్నాయి. రష్యా, భారత్, జపాన్ లాంటి దేశాలు తరువాతి స్థానాల కోసం పోటీ పడుతున్నాయి. చైనాను ఎలాగో అధిగమించలేమని చేతులెత్తేసిన ట్రంప్.. ఇక భారత్ పై పగ బట్టినట్లు తెలుస్తోంది. భారత్ ను సూపర్ పవర్ కాకుండా అడ్డుకుంటే తమ దేశ పరువు నిలుస్తుందని ట్రంప్ భావిస్తున్నట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అలాగే భారత్ ప్రస్తుతం తన ఆయుధ సంపత్తిని పెంచుకుంటోంది. ప్రపంచ దేశాల సాయం లేకుండానే స్వతంత్రంగా ఎదుగుతోంది. అమెరికా సాయం కూడా తీసుకోవడం లేదు. దీంతో ట్రంప్ భారత్ పై కక్ష కట్టినట్లు తెలుస్తోంది. అమెరికా లాంటి దేశం నుంచి సాయం పొందితే ఆ దేశం చెప్పినట్లే తోక ఆడించాల్సిన పరిస్థితిలో భారత్ లేదు. ఈ కారణంగానే భారత్ పై ట్రంప్ పగబట్టినట్లు సమాచారం.



## కేసీఆర్ అద్భుతమైన పాలనకు సజీవ సాక్ష్యం ఇవే!

## హరీశ రావు ఆసక్తికర ట్వీట్!!

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అద్భుతమైన పాలనకు సజీవ సాక్ష్యం అంటూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావుపేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఎక్స్ వేదికగా మిస్‌వరల్డ్ కంటెస్టెంట్స్ తెలంగాణలో సందర్శించిన పలు ప్రాంతాల ఫోటోలను ఆయన షేర్ చేశారు. తెలంగాణలోని హైదరాబాద్‌లో మిస్‌వరల్డ్ పోటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రపంచ సుందరీమణులు రాష్ట్ర టూరిజం శాఖ ఆధ్వర్యంలో రోజుకో ప్రదేశం సందర్శిస్తున్నారు. ముఖ్యంగా యదగిరి గుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామీ దేవాలయం, నాగార్జునసాగర్ వద్ద ఉండే బుద్ధవనం, జూబ్లీహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్, తెలంగాణ సచివాలయాన్ని అందాల భామలు సందర్శించారు. ఇందుకు సంబంధించిన ఫోటోలను ఎక్స్ వేదికగా హరీశ్ రావు ఆసక్తికర ట్వీట్ చేశారు. 'కేసీఆర్ అద్భుతమైన పాలనకు సజీవ సాక్ష్యం.. భవిష్యత్ తరాలకు నిలువెత్తు నిదర్శనం. ఎవరు అవునన్నా, కాదన్నా.. తెలంగాణ అభివృద్ధి చిహ్నాలు అవి, బీఆర్ఎస్ పాలన కీర్తి కిరీటాలు చెరిపేస్తే చెరిగేవి కావు, దాచేస్తే దాగేవి కావు.

జై కేసీఆర్, జై తెలంగాణ' అంటూ హరీశ్ రావు ట్విట్టర్‌లో ఆయన పోస్ట్ చేశారు. ఈ ట్వీట్ వైరల్‌గా మారింది.

నెటిజన్లు సైతం దీనిపై స్పందిస్తున్నారు. నిన్నటి వరకు కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తా అని అన్నారు.. నేడు అవే కేసీఆర్ ఆనవాళ్లు రేవంత్ సర్కార్ కు దిక్కైందని, కేసీఆర్ ఆనవాళ్ల ముందు ప్రపంచ సుందరీమణులు.. అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

## తెలుగు రాష్ట్రాల సీఎంలను కలిసిన బండారు దత్తాత్రేయ.. కారణం అదే ?



సీనియర్ పొలిటీషియన్, హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను కలిశారు. ముందుగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఈ సమావేశం జరిగింది. ఈ మేరకు త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న తన ఆత్మకథ తెలుగు అనువాదం 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా కోరారు. అలానే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడును సైతం దత్తాత్రేయ కలిశారు. తన ఆత్మకథ 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు. హైదరాబాద్ వేదికగా ఈ పుస్తకావిష్కరణ వేడుక నిర్వహించనున్నారు. ఈ క్రమంలోనే ఈ వేడుకలో రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలు కలుసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీంతో దేశ వ్యాప్తంగా పరిస్థితులు ఉద్రిక్తంగా ఉన్న తరుణంలో అటు రాజకీయాల పరంగా.. ఇటు పర్సనల్ గా కూడా వీరి కలయిక ప్రాధాన్యతను సంతరించుకుంది.

బండారు దత్తాత్రేయ తన రాజకీయ, వ్యక్తిగత జీవితంలోని ముఖ్య ఘట్టాలను వివరిస్తూ ఆత్మకథను రచించారు. ఈ పుస్తకం ఇప్పటికే హిందీలో 'జనతా కీ కహానీ, మేరీ ఆత్మకథా' పేరుతో విడుదలైంది. ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో ఈ హిందీ పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఇప్పుడు తెలుగు పాఠకుల కోసం 'ప్రజల కథే నా ఆత్మకథ' పేరుతో దీనిని తీసుకువస్తున్నారు.

# పాలమూరు బిడ్డను అని చెప్పుకోవడం గర్వంగా ఉంది




పాలమూరు బిడ్డనని చెప్పుకోవడానికి ఎంతో గర్వపడుతున్నానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నాగర్ కర్నూల్ పర్యటనలో భాగంగా 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు నల్లమల అంటే వెనుకబడిన ప్రాంతంగా ఉండేదని, పాలమూరు బిడ్డల కష్టంతో ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందన్నారు. గత ఎన్నికల్లో భారీ మెజార్టీ ఇచ్చి మాట నిలబెట్టుకున్నారు. ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి అదర్శంగా నిలబెడుతానని ఆ రోజే మాట ఇచ్చాను. మీరు ప్రణాళికలు వేయండి నిధులు ఇచ్చే బాధ్యత నాది అన్నారు. గిరిజనులకు అనేక పథకాలు తీసుకొచ్చిన ఘనత కాంగ్రెస్దని రేవంత్ అన్నారు. గిరిజనులను అత్మగౌరవంతో బతికేలా చేస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చినప్పటినుంచి రూ.60వేల కోట్లు రైతుల కోసం ఖర్చుపెట్టామని సీఎం వివరించారు. వరి వేస్తే ఉరే అన్న దొర తను మాత్రం వందల ఎకరాల్లో వరి వేసుకున్నాడన్నారు. కోటి మంది మహిళలను కోటిశ్వరులను చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. మహిళా సంఘాలకుపెట్రోల్ బంకులు ఇస్తున్నామన్నారు. మీరు వరివేస్తే మేము బోనస్ ఇస్తామంటున్నామని రేవంత్ అన్నారు. పేదలకు దొడ్డు బియ్యం బదులు సన్న బియ్యం ఇస్తున్నామన్నారు. గతంలో దొడ్డు బియ్యం ఇస్తే ఎవరు తినేది కాదన్నారు, ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని రేవంత్ గుర్తు చేశారు. గత పదేళ్లలో ఒక ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదని, మేము ఇస్తే నోటిఫికేషన్లు రద్దు చేయాలని ధర్నాలు చేస్తున్నారన్నారు. మేము ఏడాదిన్నరలో 60 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించడంలో మనమే నెంబర్ వన్ కేంద్రం చెప్పిందన్నారు. శాంతిభద్రతల్లో, ఆదాయంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందన్నారు. నాగర్ కర్నూల్ పర్యటనలో భాగంగా ఇవాళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమ్రాబాద్ మండలంలోని మాచారంలో ఆయన 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహ కూడా పాల్గొన్నారు. తెలంగాణలో అటవీ హక్కుల చట్టం కింద 6.69 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూములకు పోడు పట్టాలు మంజూరైన నేపథ్యంలో బీడు వారుతున్న పోడు భూములకు జలకళను తెచ్చేందుకే సర్కార్ 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకాన్ని ప్రవేశ పెట్టిందని మంత్రులు గుర్తు చేశారు.

**దేశానికే అచ్చంపేటను ఆదర్శంగా మారుస్తా: సీఎం రేవంత్ రెడ్డి** : అచ్చంపేట నియోజకవర్గాన్ని మోడల్ గా తీర్చిదిద్దుతానన్నారు సీఎం రేవంత్ రెడ్డి. నియోజకవర్గంలో ప్రతి రైతుకు సోలార్ పంపు సెట్లు పంపిణీ చేస్తామని చెప్పారు.100 రోజుల్లో అచ్చంపేటలో సోలార్ పంపు సెట్లు ఇస్తామన్నారు. సోలార్ పంపు సెట్లలో దేశానికే అచ్చంపేటను ఆదర్శంగా మార్చుతానని చెప్పారు రేవంత్. నాగర్ కర్నూలు జిల్లా మాచారంలో ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ప్రారంభించిన రేవంత్ లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రేవంత్. వ్యవసాయం కోసమే సౌర విద్యుత్ ఏర్పాటుచేశామన్నారు రేవంత్ రెడ్డి. అదనంగా వచ్చే సౌర విద్యుత్ ను ప్రభుత్వానికి ఇవ్వాలని సూచించారు. సౌర విద్యుత్ వినియోగంపై రైతులకు అవగాహన ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సౌర విద్యుత్‌తో మీకు మంచి ఆదాయం వస్తుందన్నారు రేవంత్. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో సౌర విద్యుత్ ద్వారా నీరందించే ఇందిర సౌర గిరి జల వికాసం పథకాన్ని రేవంత్ రెడ్డి ప్రారంభించారు. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనరసింహ, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ, ఎంపీ మల్లు రవితో పాటు ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సంపాదకీయం

## రష్యా మల్కా ఫిరంగిపై నృసింహ మంత్రం?

రష్యా సైనిక పాటవానికి ప్రతీకగా నిలిచే శక్తివంతమైన 2S7 మల్కా ఆర్టిలరీ వ్యవస్థల్లో ఒకదాని బ్యారెల్‌పై సంస్కృత శ్లోకం కనిపించడం ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా.., ముఖ్యంగా సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఫిరంగి వ్యవస్థల్లో ఒకటిగా పేరుగాంచిన మల్కాపై 'ఉగ్రం వీరం మహావిష్ణుం జ్వలంతం సర్వతోముఖం' అనే నృసింహ స్తోత్రం యొక్క భాగం చెక్కబడి ఉన్న దృశ్యాలు వైరల్ అవుతున్న వీడియోలలో కనిపించాయి. దాదాపు 257 మల్కా ఆర్టిలరీ వ్యవస్థలు రష్యా వద్ద ఉన్నాయని అంచనా. వీటి 203ఎంఎం ఫిరంగి మోసుకెళ్లే సామర్థ్యం, సుదూర లక్ష్యాలను ఛేదించగల ఖచ్చితత్వం రష్యా సైనిక బలగాలకు వ్యూహాత్మక బలాన్ని చేకూరుస్తున్నాయి. అయితే ఇలాంటి శక్తివంతమైన ఆయుధంపై భారతీయ ఆధ్యాత్మిక శ్లోకం ఉండటం అనేకమందిని ఆశ్చర్యపరుస్తోంది. వైరల్ అవుతున్న వీడియోలలో మల్కా ఫిరంగి బ్యారెల్‌పై స్పష్టంగా కనిపించేలా సంస్కృతంలో ఈ శ్లోకం రాయబడి ఉంది. హిందూ మతంలో విష్ణువు యొక్క భీకర రూపమైన నరసింహ స్వామిని కీర్తించే ఈ శ్లోకం, చెడును నాశనం చేసే, రక్షణ కల్పించే నరసింహుడి శక్తిని వర్ణిస్తుంది. రష్యన్లు తమ యుద్ధ ట్యాంకులు, ఫిరంగులు వంటి ఆయుధాలపై ఇలాంటి ఆధ్యాత్మిక లేదా ఇతరత్రా సందేశాలను రాయడం కొత్తేమీ కానప్పటికీ, ఒక భారతీయ సంస్కృత శ్లోకాన్ని, అదీ ఇంత శక్తివంతమైన ఫిరంగిపై ఎందుకు రాశారనే దానిపై నెట్టింట భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. కొందరు ఇది సైనికుల వ్యక్తిగత నమ్మకం కావచ్చని అంటుంటే, మరికొందరు ఇది ఒక రకమైన ఆధ్యాత్మిక రక్షణ కోసమై ఉంటుందని భావిస్తున్నారు. ఇంకొందరు మాత్రం ఇదొక ప్రచార ఆర్భాటం లేదా ప్రత్యర్థులను మానసికంగా దెబ్బతీయడానికి ఉద్దేశించిన చర్య కావచ్చని అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతానికి, ఈ శాసనం వెనుక గల అసలు కారణంపై రష్యా అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు. అయినప్పటికీ, రష్యా ఆర్టిలరీ వ్యవస్థపై నృసింహ మంత్రం ఉనికి ప్రపంచవ్యాప్తంగా సాంస్కృతిక , ఆధ్యాత్మిక అంశాలు సైనిక రంగంలోకి ఎలా ప్రవేశిస్తాయనే దానిపై ఆసక్తికరమైన చర్చకు దారితీసింది. ఈ సంఘటన రష్యా సైనికులలో కొందరిలో భారతీయ సంస్కృతి లేదా ఆధ్యాత్మికత పట్ల ఉన్న ఆకర్షణను కూడా సూచిస్తుండవచ్చని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. ఏదేమైనా మల్కా ఫిరంగిపై నృసింహ మంత్రం వ్యవహారం ప్రస్తుతానికి ఒక అంతుచిక్కని రహస్యంగానే మిగిలి ఉంది.

# అడవంతా ఆగమాగం



సిరిసిల్ల : జిల్లాలో 379.14 చదరపు కిలోమీటర్ల మేరకు అటవీ ప్రాతం ఉంటే అందులో 18.78 శాతం మాత్రమే పచ్చదనం ఉంది. అడవులు అధికంగా ఉన్న వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, రుద్రంగి మండలాల్లో యథేచ్ఛగా చెట్లను నరికి వేస్తున్నారు.

**చొచ్చుకొస్తున్న ఆక్రమణదారులు**

గతేడాది అడవుల్లో చెట్ల నరికివేత.. ఆక్రమణలపై రాష్ట్ర విజిలెన్స్ విభాగం జిల్లా అటవీ అధికారులను నివేదిక కోరింది. దీనిలో ఆక్రమణలకు గురైంది సహజ అటవీ ప్రాంతమా? ప్లాంటేషన్ చేసిందా? అన్న వివరాలను వేర్వేరుగా ఇవ్వాలని కోరారు. దీనికోసం జిల్లాలో బీట్లవాగా నివేదికను క్రోడీకరించగా 251.67 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు పంపారు. వాస్తవానికి ఇంతకు రెండింతలు జరిగి ఉంటుందని స్థానికుల సమాచారం.

ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి సెక్షన్ పరిధిలోని గుండారం శివారులోని అటవీ భూములను కొందరు చొరబడి చెట్లకు నిప్పు పెట్టి కాల్చివేస్తున్నారు. అటవీ అధికారుల సంచారం లేని సమయం చూసుకుని గుట్టుచప్పుడు కాకుండా చదును చేస్తున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 50 హెక్టార్ల మేరకు అటవీ భూమి ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. ఈ సెక్షన్ పరిధిలోని తిమ్మాపూర్, వెంకటాపూర్, గుంటపెల్లిచెరువుతండా ప్రాంతాల్లోని అడవుల్లో వృక్షాలను నేలకూల్చి క్రమక్రమంగా 12 హెక్టార్లలో సాగుకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. వీర్నపల్లి మండలం వన్‌పల్లి శివారులో అటవీ భూములు క్రమంగా అన్యాక్రాంతమవుతున్నాయి. ఎర్రగడ్డతండా, గర్జనపల్లి, అడవిపదిర, బావుసింగ్‌నాయక్‌తండా, బాబాయిచెరువుతండా తదితర గ్రామాల పరిధిలో కొన్నేళ్లుగా పోడు వ్యవసాయం జోరుగా సాగుతోంది. అడవిలో విలువైన చెట్లను నరికివేస్తూ ఆరుతడి పంటలు సాగుచేస్తున్నారు. గర్జనపల్లి శివారులో సుమారు 40 హెక్టార్ల అటవీభూమి అన్యాక్రాంతమైనట్లు అటవీశాఖ గుర్తించింది.

కోనరావుపేట మండలం శివంగలపల్లి, వట్టిమల్లలో రెవెన్యూ అటవీ హద్దులు తేలకపోవడంతో రెండింటిలోనూ ఆక్రమణలు జరుగుతున్నాయి. ఇక్కడ రెండు శాఖల మధ్య సమన్వయంతో ఎంత ఆక్రమణలు జరిగాయనేది స్పష్టత లేదు. చందుర్తి మండలం సనుగుల, తిమ్మాపూర్. రుద్రంగి మండలం వీరునితండా, గైరిగుట్టతండాలో అటవీభూములను చదునుచేసి పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేశారు. రుద్రంగి మండలంలో అటవీభూములుగా గుర్తించి హద్దురాళ్లు ఉన్నప్పటికీనీ లెక్కచేయకుండా చొచ్చుకొస్తున్నారు.

**కారణాలు**

అటవీశాఖ ప్రగతిపై కరీంనగర్ కార్యాలయంలో సమీక్షలు నిర్వహించడం.. అక్కడి నుంచి పర్యవేక్షణలు చేయడం తప్ప క్షేత్రస్థాయి సమస్యలపై దృష్టి సారించడం లేదు.

ఏటా హరితహారంలో మొక్కలు నాటుతున్నా.. వాటి లెక్కలు, సంరక్షణ బాధ్యతలు కూడా కరీంనగర్ నుంచే జరుగుతోంది. ఇక్కడి సిబ్బంది వాటిపై పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నారు.

రహదారులకు ఇరువైపుల ఉండే వృక్షాల రక్షణకు ఇస్తున్న ప్రాధాన్యం అటవీలోపల ఉన్న వృక్షాలపై చూపడంలేదు. దీంతో అక్రమార్కులు అడ్డదారుల్లో చెట్లను నరికి కలప తరలిస్తున్నారు.

ఆక్రమిత అటవీ భూములను గుర్తించి స్వాధీనం చేసుకుంటున్నట్లు అధికారులు ప్రకటిస్తున్నా.. క్షేత్రస్థాయికి వెళ్లేసరికి గిరిజనుల నుంచి వ్యతిరేకత వస్తోంది.

# వ్యాయామ వేళ జాగ్రత్త!

గోదావరిఖని : ఆరోగ్యకరమైన జీవనం కోసం రోజూ ఉదయం, సాయంత్రాలు వ్యాయామం చేసేవారి సంఖ్య పెరుగుతోంది. నడక.. వ్యాయామం.. యోగా.. ఇలా ఎవరికి నచ్చిన మార్గంలో వారు శరీరానికి కొంత శ్రమ కలిగిస్తున్నారు.. ప్రస్తుతం ఎండలు మండుతున్న సమయంలో తగు జాగ్రత్తలతో వ్యాయామం చేస్తేనే ఆరోగ్యపరంగా ఎలాంటి ఇబ్బందులు రావని వైద్యులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. తాజాగా 39 – 40 డిగ్రీలు నమోదవుతున్నాయి. ఉక్కపోత కూడా పెరుగుతోంది. మున్ముందు ఉష్ణోగ్రతలు ఇంకా పెరిగే అవకాశం ఉంది. అందువల్ల వ్యాయామం చేసేవారు మరింత జాగ్రత్తగా ఉండాలి.

**డీహైడ్రేషన్‌కు అవకాశం**

వేసవిలో డీహైడ్రేషన్‌కు అవకాశం ఉంటుంది. వ్యాయామం వల్ల చెమట ఎక్కువగా బయటకు వెళ్తుంది. శరీరం వెంటనే అలసిపోతుంది. ఉదయం, సాయంత్రం వాతావరణం చల్లగా ఉన్నప్పుడు మాత్రమే వ్యాయామం చేయాలి. తాగునీరు, ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలి. ఏదైనా సమస్య అనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.
అశోక్, సీనియర్ ఫిజిషియన్, గోదావరిఖని

**వైద్యుల సూచనలు ఇవీ..**

ఉదయం 8 గంటల లోపు వ్యాయామం పూర్తి చేయాలి.
సాయంత్రం 7 గంటల తరవాతే మైదానాలకు వెళ్లాలి.
శరీరం సహకరించిన మేరకే కసరత్తు అవసరం.



వయసులో పెద్దవారు ఒంటరిగా కాకుండా బృందాలుగా వ్యాయామానికి వెళ్లాలివెంట తాగునీరు, ఓఆర్ఎస్ ఉంచుకోవాలి
చెమట రూపంలో ఒంట్లో ఉన్న లవణాలు ఎక్కువగా బయటకు వెళ్లడం వల్ల వెంటనే అలసిపోతారు. శక్తినిచ్చే ద్రవాలు తీసుకోవాలి
ఒంట్లో సోడియం స్థాయిలు తగ్గిపోకుండా కొద్ది మొత్తంలో ఉప్పు నీరు తీసుకోవచ్చు..వ్యాయామం చేసే సమయంలో మధ్యమధ్యలో కొంత విరామం తప్పనిసరి. కళ్లు తిరిగినట్లనిపించినా, తల తప్పినట్లనిపించినా వెంటనే ఆపివేయాలి. కొద్ది సేపు విశ్రాంతి తీసుకోవాలి. సమస్య మరీ ఎక్కువనిపిస్తే ఆస్పత్రికి వెళ్లాలి.

ఉమ్మడి జిల్లాలో..జిమ్‌లు : 250
ఓపెన్ జిమ్‌లు : 150
మైదానాలు : 300
రోజూ నడిచే వారి సంఖ్య : 4 లక్షలు
వ్యాయామం చేసే వారి సంఖ్య : 1.5 లక్షలు

# సీబీఎస్ఈ తరగతుల నిర్వహణకు అనుమతులు




గోదావరిఖని : సింగరేణి సంస్థ పాఠశాలలతో పాటు కళాశాలలు, సాంకేతిక విద్యా కేంద్రాలను నిర్వహిస్తోంది. వీటిల్లో కార్మికుల పిల్లలు చదువుతుంటారు. వారి నుంచి సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) విధానంలో బోధనకు డిమాండ్ రావటంతో యాజమాన్యం ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా యైటింక్లైన్‌కాలనీలోని సెక్టర్–3 పాఠశాలలో వసతులు మెరుగుపరిచారు. వచ్చే విద్యా సంవత్సరంలో ఈ విధానాన్ని పాఠశాలలో అమలు పరిచేందుకు శనివారం ఆదేశాలు వచ్చాయి. ప్రస్తుతం సింగరేణిలోనే ఉత్తమ పాఠశాలగా గుర్తింపు పొందిన సెక్టార్–3 పాఠశాలలో సీబీఎస్ఈ విధానంతో బోధించేందుకు అనుమతి లభించడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.

**2030 వరకు అమలు**

వచ్చే విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ తరగతులు ప్రారంభించేందుకు యాజమాన్యం చర్యలు తీసుకుంటుంది. ఈ మేరకు శనివారం అనుమతులు రావటంతో సీబీఎస్ఈ తరగతులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏడాది క్రితం సీబీఎస్ఈ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టేందుకు గల పాఠశాలలోని వసతులు, సౌకర్యాలను కేంద్ర పాఠశాలల బృందం పరిశీలించింది. ల్యాబ్‌లతో పాటు క్రీడా మైదానం, విశాలమైన తరగతి గదులు ఉండటంతో అర్హత సాధించింది. ఒకటి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు సీబీఎస్ఈ విధానంలో బోధన అందించేందుకు 2030 సంవత్సరం వరకు అనుమతులు ఇచ్చారు.

**నెరవేరిన కార్మికుల కల**

సింగరేణి గనులు ఉన్న ప్రాంతాల్లో సీబీఎస్ఈ విధానంలో బోధించే పాఠశాలలు లేకపోవటంతో కార్మికుల పిల్లలను ఇతర ప్రాంతాలకు పంపించేవారు. ఈ నేపథ్యంలో సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానం ద్వారా బోధించేందుకు యాజమాన్యం చర్యలు తీసుకోవాలనే డిమాండ్ పెరిగింది. రామగుండం ప్రాంతంలో కేవలం ఎన్టీపీసీటౌన్‌షిప్‌లో మాత్రమే కేంద్రీయ విద్యాలయం ఉంది. ప్రస్తుతం సింగరేణిలో యువ కార్మికులు పెరగడంతో వారి పిల్లలు ప్రాథమిక విద్య చదువుకుంటున్నారు. వారికి నాణ్యమైన విద్యనందించేందుకు సరైన పాఠశాలలు లేకపోవంతో భారీగా డబ్బులు వెచ్చించి ఇతర ప్రాంతాలకు పంపిస్తున్నారు. ప్రస్తుతం యైటింక్లైన్‌కాలనీలోని సెక్టర్–3 పాఠశాలకు సీబీఎస్ఈ అనుమతులు రావటంతో యువ కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**మరో పాఠశాలకు ప్రయత్నం**

మరో సింగరేణి పాఠశాలలో సీబీఎస్ఈ అమలుకు ప్రయత్నిస్తాం. ప్రస్తుతం సెక్టర్–3 పాఠశాలకు అనుమతులు రావటంతో జైపూర్‌లోని సింగరేణి విద్యుత్తు కేంద్రం పరిధిలోని కాలనీలో మరో పాఠశాల నిర్వహించేందుకు అనుమతి కోసం ప్రయత్నిస్తాం. సింగరేణి కార్మికుల పిల్లలకు మెరుగైన విద్యనందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం. బలరాం, సింగరేణి సీఎండీ

# చిన్న రైతుకు రాయితీ ఫలం

పెద్దపల్లి : వరి సాగు తగ్గించి రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించే దిశగా ప్రభుత్వం దృష్టి సారించింది. ఉపాధిహామీ పథకంలో పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. సన్న, చిన్నకారు రైతులకు రాయితీ అవకాశం కల్పిస్తోంది. నాటిన తర్వాత మూడేళ్ల వరకు నిర్వహణ ఖర్చులను చెల్లిస్తోంది. పథకంలో భాగంగా ఉద్యాన పంటలను సాగు చేస్తున్న రైతులు అదనపు ఆదాయం పొందుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లక్ష్యాలను నిర్ణయించారు. అయిదెకరాల లోపు భూమి ఉండి, జాబ్‌కార్డున్న రైతులు ఈ పథకానికి అర్హులు. ప్రస్తుతం దరఖాస్తులు స్వీకరిస్తుండగా వానాకాలం ఆరంభం నాటికి లబ్ధిదారులను ఎంపిక చేయాలని భావిస్తున్నారు.

**మూడేళ్ల వరకు నిర్వహణ బాధ్యత**

ఉపాధిహామీలో భాగంగా ఉద్యాన పంటలైన మామిడి, నిమ్మ, బత్తాయి, జామ, సీతాఫలం, సపోట, జీడిమామిడి, మునగ, డ్రాగన్‌ఫ్రూట్, అల్లనేరేడు, ఆపిల్‌బేర్, దానిమ్మ, కొబ్బరి పంటల సాగుకు అవకాశం ఉంది. పండ్ల తోటల నిర్వహణ బాధ్యతను మూడేళ్ల వరకు ప్రభుత్వమే భరిస్తుంది. ఒక్కో మొక్కకు మామిడి, సపోట, జీడి మామిడి, ఆయిల్‌పామ్‌లకు రూ.686, జామ, నిమ్మ, బత్తాయి, దానిమ్మ, సీతాఫలం, కొబ్బరిలకు రూ.580 చొప్పున మూడేళ్ల పాటు, డ్రాగన్‌ఫ్రూట్ అర ఎకరంలో 900 మొక్కలు నాటితే రూ.2.68 లక్షలు చొప్పున రెండేళ్ల వరకు అందజేస్తారు. సాగు చేసిన ఏడాదితో పాటు మరో రెండేళ్లు నిర్వహణ ఖర్చులు చెల్లిస్తారు.

**అన్నదాతకు అవగాహన**

ఉమ్మడి జిల్లాలో పండ్ల తోటల సాగుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల సమన్వయంతో లక్ష్యాలు అధిగమించేలా కార్యాచరణ రూపొందించారు.



ఎంపీడీవో కార్యాలయాల్లో ఆధార్, జాబ్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, ఇతర పత్రాలతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రైతులు దరఖాస్తు చేసుకొనేలా క్షేత్ర సహాయకులు అవగాహన కల్పిస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం, మిగిలిన సామాజికవర్గాలకు రూ.90 శాతం రాయితీతో బిందు సేద్యం పరికరాలు పంపిణీ చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో సారవంతమైన నేలలు, రైతుల్లో ఆసక్తి ఉన్నా పెట్టుబడుల భారంతో పండ్ల తోటల సాగుకు ముందుకు రావడం లేదు. కొన్నేళ్లుగా ప్రభుత్వం పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తుండటంతో బీడు భూముల్లో రైతులు సాగు చేస్తున్నారు. తెగుళ్లు, అతివృష్టితో నష్టం వాటిల్లుతోంది. ఈ మేరకు రైతులను చైతన్యం చేస్తే లక్ష్యాలు చేరనున్నాయి.

**సద్వినియోగం చేసుకోవాలి**

ఉపాధిహామీలో పండ్ల తోటల పెంపకానికి రైతులు ముందుకు రావాలి. జాబ్‌కార్డు కలిగిన సన్న, చిన్నకారు రైతులు దరఖాస్తు చేసుకోవాలి. మొక్కల కొనుగోలు నుంచి నాటడం వరకు నిర్వహణ ఖర్చులు చెల్లిస్తున్నాం. లాభదాయకమైన పండ్ల మొక్కలను నాటుకోవడం ద్వారా నికర ఆదాయం వస్తుంది. కాళిందిని, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

# అక్కరకురాని శుద్ధి కేంద్రం

నర్సాపూర్: నర్సాపూర్‌లో నిర్మాణం పూర్తయిన మానవ వ్యర్థాల శుద్ధి కేంద్రం ఎఫ్ఎస్‌టీపీ(ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ను వినియోగించకుండా తాళం వేశారు. దీంతో ఏడాదిగా ఇది ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంలా మారింది. ఇందుకోసం రూ.20లక్షల నిధులు వెచ్చించారు. గత ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పురపాలికల్లో వీటి నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు పట్టణంలో వెల్దుర్తి వెళ్లే మార్గంలోని ప్రభుత్వ భూమిని దీనికి కేటాయించగా.. గుత్తేదారు ఏడాది క్రితమే పనులు పూర్తిచేశారు. జనావాసాలకు దూరంగా దీని నిర్మాణం చేపట్టారు. మానవ వ్యర్థాల శుద్ధికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. బోరు, ట్యాంకులు, అరలతో కూడిన సంపులు నిర్మించారు.
**నిబంధనలు పాటించక** నివాస గృహాల్లో సెప్టిక్ ట్యాంకులు నిండినప్పుడు వ్యర్థాలను కొందరు తీసుకెళ్లి శివారు ప్రాంతాల్లో ఖాళీ చేస్తున్నారు. దీంతో దుర్గంధం వ్యాపిస్తోంది. వ్యాధులు వ్యాపించే అవకాశం లేకపోలేదు. వ్యర్థాలను తరలించే వారు సైతం ఎలాంటి నిబంధనలు పాటించడం లేదు. సెప్టిక్ ట్యాంకు నిండినప్పుడు వాటిని శుభ్రపర్చడానికి వెళ్లి కొందరు మృత్యువాతపడిన సందర్భాలు ఉన్నాయి. దీంతో పురపాలిక సిబ్బందే వ్యర్థాలను ఇళ్ల నుంచి ప్లాంటుకు తరలిస్తారు. శుద్ధి చేశాక వచ్చే నీటిని నిర్ణీత ప్రదేశంలోనే ఖాళీ చేయిస్తారు.

# సన్నధాన్యం.. కదలదేమి..!

సిరిసిల్ల : జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల లక్ష్యంలో సగం పూర్తయ్యింది. అయినా రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. ప్రభుత్వ మద్దతుధర క్వింటాలుకు రూ.2,320తోపాటు రూ.500 బోనస్ ఇస్తుందనే ఆశతో సన్నధాన్యం పండించిన రైతుల బాధ వర్ణనాతీతం. నెలరోజులుగా కేంద్రాల్లోనే ఎండకు నిల్వ ఉంచడంతో నూకశాతం పెరుగుతోంది. ధాన్యాన్ని దించుకునేందుకు మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారు. జిల్లాలో యాసంగిలో మొత్తం 1,78,707 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. అందులో దొడ్డురకం 1,60,845 లక్షల ఎకరాలు.. సన్నరకం 17,862 ఎకరాల్లో సాగుచేశారు. సన్నరకం ఎకరాకు 27 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా. ఈ లెక్కన జిల్లాలో సాగుచేసిన సన్నాలకు కలిపి 48వేల క్వింటాళ్ల దిగుబడి రావాలి. కాగా ఇప్పటి వరకు కొనుగోలు చేసింది. 3,615 క్వింటాళ్లు మాత్రమే. జిల్లాలో 244 కొనుగోలు కేంద్రాల్లో తూకాలు జరుగుతున్నాయి. నెలరోజులుగా కేంద్రాల నిర్వాహకులకు సన్నధాన్యం మిల్లుల కేటాయింపులో స్పష్టత కరవైంది. వివరికి కొనుగోలు కేంద్రంలో దొడ్డురకం కేటాయించిన మిల్లులకే సన్నాలను పంపుతున్నారు. కాగా అక్కడ సన్నధాన్యం దింపుకునేందుకు మిల్లర్లు ఆసక్తి చూపడంలేదు. యాసంగిలో సన్నాల మిల్లింగ్‌లో నూకశాతం పెరుగుతోంది. క్వింటాలుకు 55 కిలోలు రావడం కష్టం. దీంతో లేవీలో భారీగా తరుగు వస్తుంది. ఈ నష్టాన్ని పూడ్చడం ఇబ్బందిగా మారుతుందని మిల్లర్లు అంటున్నారు. దీంతో చాలా చోట్ల తూకం వేసినవి, మరికొన్ని చోట్ల తూకం వేయకుండా ఉన్నవి కేంద్రాల్లో పేరుకుపోయాయి. అకాల



వర్షాల నుంచి వాటిని తడవకుండా ఉండేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు.

మరో పదిహేను రోజుల్లో వానాకాలం సీజన్ ప్రారంభమవుతుంది. ఈ లోపు ధాన్యం తూకాలు పూర్తయితే.. వ్యవసాయ పనులకు సిద్ధం కావాలని రైతులు అంటున్నారు. పౌరసరఫరాలశాఖ నుంచి సన్నధాన్యం దించుకునేందుకు మిల్లర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి తూకాల్లో వేగం పెంచేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

**తూకం వేసినా తరలించడంలేదు**

నాకు 12 ఎకరాల సాగుభూమి ఉంది. దానిలో పది ఎకరాలు దొడ్డురకం, రెండు ఎకరాల్లో సన్నధాన్యం సాగుచేశా. కోతలు పూర్తయి నెలరోజులు అవుతోంది. తొలుత గ్రామంలోని పీఏసీఎస్ కేంద్రానికి ధాన్యాన్ని తీసుకువచ్చా. అక్కడ దొడ్డుధాన్యం తూకంవేసి తరలించారు. సన్నాలకు ఆలస్యం అవుతుందని చెప్పడంతో రూ.4 వేలు ఖర్చుచేసి ఐకేపీ కేంద్రానికి తరలించా. అధికారులు స్పందించి ధాన్యం తరలించేలా చర్యలు తీసుకోవాలి.

అనుముల లింగారెడ్డి రైతు నిమ్మపల్లి

కొనుగోలు చేసిన దొడ్డు ధాన్యం: 1,75,289 క్వింటాళ్లు
సన్నధాన్యం: 3,615 క్వింటాళ్లు
విక్రయించిన రైతులు: 25,245 మంది
కొనుగోలు చేసిన ధాన్యం విలువ: రూ.406.67 కోట్లు
రైతులకు చెల్లించిన మొత్తం: రూ.196.46 కోట్లు


# పరిసరాల పరిశుభ్రతే శ్రీరామరక్ష

వెల్గటూరు : ఆరోగ్య పరిరక్షణకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతే ప్రధానం. అనారోగ్యం పాలైన తర్వాత ఆస్పత్రుల చుట్టూ తిరగడం కన్నా నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవటమే మేలు. దోమల వల్ల అనేక రోగాలు వ్యాప్తి చెందుతాయి. ఏటా మే 16న జాతీయ డెంగీ నివారణ దినం నిర్వహిస్తున్నారు.

**దోమలే శత్రువులు**డెంగీ, మలేరియా, ఫైలేరియా, మెదడువాపు, చికెన్ గన్యా, జికా వంటి వ్యాధుల వ్యాప్తికి దోమలే ప్రధాన కారణం. ఇంటి ఆవరణ, పరిసరాలలో నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో దోమలు సంతానోత్పత్తి సాధిస్తాయి. ఏడీస్ ఈజిప్టై దోమ కుడితే డెంగీకి దారి తీస్తోంది. ఈ దోమ ఎక్కువగా మధ్యాహ్నం వేళలో మోకాలెత్తు వరకు మాత్రమే సంచరిస్తోంది.

**నిర్ధారణ పరీక్షలు..** డెంగీ లక్షణాలు కనిపిస్తే ఆస్పత్రులకు వెళ్లి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. ఈ వ్యాధి నిర్ధారణకు ఎలీసా పరీక్ష ప్రామాణికమైంది. మందులు వాడటం, ద్రావణాలు తీసుకోవాలి.

నివారణ చర్యలుపడుకునేటప్పుడు దోమ తెరలు వాడాలి. ఇంటి కిటికీలకు జాలీలు ఏర్పాటు చేసుకోవాలి. పరిసరాల్లో దోమల నివారణ



మందులు పిచికారీ చేయాలి.

ఇంటి ఆవరణలో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలి.

సెప్టిక్ ట్యాంకు గొట్టం, గ్యాస్ పైపులైన్ వంటి వాటికి పలుచని వస్త్రం చుట్టాలి.మురుగు కాలువల్లో ఎప్పటికప్పుడు చెత్తాచెదారం తొలగించాలి. అందుబాటులో మందులు

డెంగీ మందులు ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. జ్వరాలన్నీ డెంగీ అని ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎలీసా పరీక్ష ద్వారా నిర్ధారణ అయినప్పుడు జాగ్రత్తలు పాటించాలి. పదేళ్ల లోపు చిన్నారులు, గర్భిణులు, ఊబకాయం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు జాగ్రత్తగా ఉండాలి. డా.శ్రీనివాస్, జిల్లా ఉప వైద్యాధికారి, జగిత్యాల

లక్షణాలు తీవ్రమైన జ్వరం, తలనొప్పి
శరీరంపై ఎర్రని దద్దుర్లు
కండరాలు, కీళ్ల నొప్పులు
ఆకలి మందగించడం
రక్తస్రావం జరిగి ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లటం

# పేరు మార్పిడికి ముప్పు తిప్పలు



కరీంనగర్ : ఆదర్శనగర్‌కు చెందిన ఓ తండ్రి తన కుమారుల పేరుమీద ఐదు నెలల కిందట ఆస్తి రిజిస్ట్రేషన్ చేశారు. పేర్లు మార్చుకోవడానికి దరఖాస్తు చేయగా.. ఇప్పటికీ ఆ దరఖాస్తు కదలడం లేదు. చింతకుంటకు చెందిన ఓ ఆటోడ్రైవర్ ఆన్‌లైన్‌లో కొత్త అసెస్‌మెంట్ కోసం రూ.1500లు చెల్లించారు. ఆర్ఐ విచారణ చేసి ఇంటి నంబర్ కేటాయించాల్సి ఉండగా గడువు దాటుతోంది. మళ్లీ ఆన్‌లైన్ చేయాలంటే రూ.1500లు చెల్లించాల్సి వస్తోందోమోనని ఆందోళన చెందుతున్నాడు.

మల్కాపూర్‌లో ఖాళీ స్థలానికి వీఎల్‌టీలో ఇంటి నంబర్ తీసుకోవడానికి రూ.13 వేలు ఆన్‌లైన్‌లో చెల్లించి దరఖాస్తు చేశారు. నంబర్ కేటాయించకపోవడంతో అర్జీదారుడు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో ఒకటెండ్రు కాదు.. అత్యధిక సంఖ్యలో పేరు మార్పిడి, కొత్త అసెస్‌మెంట్ల కోసం దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. క్షేత్రస్థాయి నుంచి విభాగం అధికారి వరకు దస్త్రం పెండింగ్‌లో లేదని పేర్కొంటుండగా.. దరఖాస్తుదారులు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. రెవెన్యూ విభాగంలో పని చేస్తున్న ఆర్ఐలను తరుచుగా డివిజన్లు మారుస్తుండటంతో ఏ దస్త్రం ఎక్కడ ఉందో తెలియదనే సమాధానం వస్తుంది.

**సొంత 'నిబంధనలు'..**

ఇతర కార్పొరేషన్‌లలో లేని నిబంధనలను ఇక్కడ అమలు చేస్తుండటంతో అర్జీదారులు అవస్థలు పడుతున్నారు.

ఇటీవలె రెవెన్యూ విభాగానికి కొత్తగా ఉద్యోగులురాగా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ.. పౌరులకు సంబంధించిన దస్త్రాల పరిశీలనలో ఉండటం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అడ్డదారుల్లో వచ్చి ఎంతో కొంత ముట్టజెప్పిన వారికి మాత్రం సులువుగా పనులు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అయిదు నెలలుగా పెండింగ్

రిజిస్ట్రేషన్ అయిన తర్వాత వారం రోజుల్లో మ్యూటేషన్ పూర్తి చేయాల్సి ఉండగా జరగడంలేదు. పేరు మార్పిడి, పన్ను మదింపు వంటి అర్జీలను నిర్ణీత గడువులోగా చేయాల్సి ఉండగా ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉంటున్నట్లు మాజీ కార్పొరేటర్లు ఆగ్రహిస్తున్నారు. సామాన్య ప్రజలు నానావస్థలు పడుతుండగా కనీసం పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**వెంటనే పూర్తి చేస్తాం**పాత భవనం నుంచి కొత్త భవనంలోకి రికార్డు గది మారడం, దస్త్రాలు దొరకకపోవడం, సర్వేల కారణంగా కొంత ఆలస్యమైంది. వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. ఇబ్బందులు ఎదురైతే దరఖాస్తుదారుడు స్వయంగా వచ్చి ఫిర్యాదు చేయాలి. భూమానందం, ఆర్వో, కరీంనగర్ నగరపాలిక

# అయిదు వేల మంది పింఛనకు దూరం




గోదావరిఖని : సింగరేణి వ్యాప్తంగా 5,058 మంది విశ్రాంత కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు రావాల్సిన పింఛనును అధికారులు నిలిపివేశారు. జీవన ప్రమాణ పత్రాలు అందించకపోవటంతోనే పింఛన్ నిలిచిపోయినట్లు తెలుస్తోంది. విశ్రాంత కార్మికులు, వారి కుటుంబీకులు ప్రతి సంవత్సరం జీవన ప్రమాణ పత్రాలు అందించాల్సి ఉంటుంది. ఏటా డిసెంబరు నెలలో జీవన ప్రమాణ పత్రాలు ఆఫ్‌లైన్‌లో లేదా ఆన్‌లైన్‌లో అందించాలని సీఎంపీఎఫ్ అధికారులు ప్రకటన ఇస్తారు. అయినా కొంతమంది జీవన ప్రమాణ పత్రాలు అందించకపోవడం వల్ల వారికి రావాల్సిన పింఛను నిలిచిపోయింది.

**82 వేల మంది పింఛనుదారులు**

సింగరేణిలో ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులు 82,387 మంది ఉన్నారు. వీరంతా పింఛను పొందుతున్నారు. నెలకు వీరికి రూ.79.91 కోట్లు సీఎంపీఎఫ్ సంస్థ చెల్లిస్తోంది. ఇందులో అతి తక్కువగా రూ.1000 లోపు పింఛను పొందుతున్న వారు 8349 మంది ఉన్నారు.

**మూడు దశాబ్దాలుగా సవరణ లేదు**

బొగ్గుగని కార్మికుల పింఛను సవరించకపోవడంతో పాత విధానంలోనే విశ్రాంత కార్మికులు లబ్ధి పొందుతున్నారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి సవరించాల్సిన పింఛను ఇప్పటివరకు ఒక్కసారి కూడా మార్పు చేయలేదు. మార్కెట్ సూచీ, ధరల ప్రకారం ప్రతి మూడేళ్లకు ఒకసారి విశ్రాంత కార్మికులకు చెల్లిస్తున్న పింఛను సవరించాలి. కానీ 1995లో ప్రవేశపెట్టిన పింఛనును మూడు దశాబ్దాలుగా అదే స్థాయిలో చెల్లిస్తున్నారు. దీంతో రూ.1000 లోపు పింఛను పొందుతున్న విశ్రాంత ఉద్యోగులు కూడా ఉన్నారు. కనీస పింఛను రూ.10 వేలకు పెంచాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అయినా యాజమాన్యం పట్టించుకోవడం లేదు. పింఛను నిధిని ఆర్థికంగా పరిపుష్టం చేసేందుకు సింగరేణి చర్యలు తీసుకుంటుంది. ప్రతి టన్నుపై బొగ్గు పరిశ్రమల యాజమాన్యాలు రూ.20 చెల్లిస్తున్నాయి. దీనివల్ల వనరులు పెరిగి పింఛను చెల్లింపులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని నిర్ణయం తీసుకున్నారు. ఈ సమయంలోనైనా పింఛను సవరించాలని విశ్రాంత కార్మికులు కోరుతున్నారు.

పింఛనుదారుల వివరాలు
మొత్తం పింఛనుదారులు:82,387
నెలకు పొందుతున్న పింఛను(రూ.లలో) :రూ.79,91,74,462
ప్రస్తుతం పింఛను అందని వారు :5,058

# పగటి పూట దోమ.. ప్రమాదం సుమా..!


మిర్యాలగూడ : ప్రజలను అతలాకుతలం చేసే వ్యాధుల్లో డెంగీ ఒకటి. ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల దోమలు వ్యాప్తి చెందుతూ ఉమ్మడి జిల్లాలో డెంగీ విజృంభిస్తోంది. పగటి పూట కుట్టే ఆడ ఈడిస్ ఈజిప్టై దోమ కాటుతో డెంగీ రావడంతో పాటు అదే దోమ ఇతరులను కుడితే ఒకరి నుంచి మరొకరికి సైతం వ్యాప్తి చెందుతుంది. డెంగీకి కారణమయ్యే వైరస్‌లు నాలుగు రకాలుంటాయి. ఒక రకం వైరస్‌తో ఒక మనిషికి ఒక సారి మాత్రమే డెంగీ సోకుతుంది. అవగాహన కల్పించి.. దీన్ని నివారించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏటా మే 16న 'జాతీయ డెంగీ నివారణ దినం' నిర్వహిస్తోంది.

**ఉమ్మడి జిల్లాలో ఇలా...**

ఉమ్మడి జిల్లాలో 2024లో సుమారు 700కు పైగా డెంగీ కేసులు నమోదు కాగా..ఈ ఏడాది ఇప్పటివరకు 10 లోపు కేసులున్నాయి. నల్గొండ జిల్లాలో 2024లో 357 కేసులు నమోదు కాగా.. ప్రస్తుతం మూడు కేసులున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పురపాలికలు, గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన సాగుతుండడంతో ఈ సారి దోమల నివారణ అసాధ్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరో 15 రోజుల్లో దోమల కాలం రానుండడంతో ముందస్తు చర్యలు చేపట్టి దోమలను, డెంగీని అరికట్టాల్సిన అవసరముంది.

**తొలి దశ లక్షణాలు ఇవీ..**

తీవ్రమైన జ్వరం. భరించలేని తలనొప్పి. ఆకలి లేకపోవడం. కళ్ల వెనుకాల నొప్పి..ఎర్రబడడం. చర్మంపై ఎర్రటి దద్దులు, దురద. వికారం, వాంతులు. ఒంటి, కీళ్ల నొప్పులు



**నివారణ మార్గాలు..**

ఇంటి పరిసరాల్లో పాత కూలర్లు, కొబ్బరి చిప్పలు, టైర్లు వంటివి లేకుండా చూడడంతో పాటు వాటిలో నీరు నిల్వకుండా చూసుకోవాలి. కిటికీలు, తలుపులకు దోమ తెరలు అమర్చాలి. బయటకు వెళ్లేటప్పుడు పొడుగు చేతుల చొక్కా, ప్యాంటు ధరించాలి. కాళ్లు, చేతులకు దోమల క్రీములు రాసుకోవాలి. వీధులు, పక్క కాల్వల్లో దోమలు గుడ్లు పెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

ముందుగా నిర్ధారించాలి..డాక్టర్ అల్లుబెల్లి జగన్‌రెడ్డి, ప్రాంతీయ ఆసుపత్రి వైద్యుడు, మిర్యాలగూడ

డెంగీ లక్షణాలు ఉండి.. ఐదు రోజుల వరకు జ్వరం తగ్గకపోతే తక్షణమే పరీక్షలు చేయించాలి. వ్యాధి నిర్ధారణ అయితే తగిన చికిత్సను తక్షణమే ప్రారంభించాలి. జ్వరం తగ్గగానే వ్యాధి తగ్గిందని భ్రమ పడకూడదు. ప్లేట్‌లెట్ల సంఖ్య లక్ష కన్నా తగ్గినప్పుడు తప్పని సరిగా డాక్టర్ల పర్యవేక్షణలో ఉండాలి. 50 వేల కన్నా పడిపోతే ఆసుపత్రిలో చేరాల్సి ఉంటుంది. అంతకంటే తగ్గితే ప్లేట్‌లెట్లను ఎక్కించాల్సి ఉంటుంది. వీటన్నింటికంటే ముందుగా ఇంట్లో దోమలు వ్యాప్తి చెందకుండా, కుట్టకుండా జాగ్రత్తలు పాటిస్తే డెంగీని నివారించవచ్చు.

# పండ్ల మొక్కలు పెరగలే.. వానరాలు వాపస్ పోలే

కోరుట్ల : పల్లెల్లో కోతుల తీవ్రత ఎక్కువై గ్రామాల్లో ఇళ్లపైనే సంచరిస్తూ ప్రజలను గాయపరుస్తూ, ఇబ్బందులకు గురిచేస్తుండంతో.. విస్తృతంగా పండ్ల మొక్కలు పెంచి వానరాలు గ్రామాలను విడిచి అటవీబాట పట్టించేందుకు 2020లో అప్పటి జిల్లా కలెక్టర్ శరత్ తెలంగాణకు హరితహారం పేరిట ఊరురా మంకీఫుడ్‌కోర్టులను ఏర్పాటు చేశారు. మండలానికి ఒక గ్రామం చొప్పున జగిత్యాల జిల్లాలోని 18 మండలాల్లో 18 గ్రామపంచాయతీలను ఎంపిక చేశారు. 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం'లో పండ్ల మొక్కల పెంచాలని ఆదేశాలు జారీ చేశారు. కోరుట్ల మండలం అయిలాపూర్ మేజర్ గ్రామ పంచాయతీలోని శ్రీఅనంతపద్మనాభస్వామి



గుట్టను ఎంపిక చేసి అయిదు ఎకరాల విస్తీర్ణంలో 2 వేలకుపైగా వివిధ రకాల పండ్ల మొక్కలు ప్రైవేటు నర్సరీల నుంచి తెప్పించి నాటించారు. మొక్కలకు రక్షణగా ఇనుప కంచె ఏర్పాటు చేశారు. మొక్కలకు నిత్యం నీటిని పట్టించేందుకు ప్రత్యేకంగా బోరుబావిని తవ్వించి విద్యుత్తు సౌకర్యం, ప్రత్యేక పైపులైన్ అమర్చారు. వర్షాకాలంలో గుట్టపైనుంచి పారే నీరు ఇంకేందుకు భారీ ఇంకుడు గుంతను నిర్మించారు. సుమారు రూ.7 లక్షల వరకు ఖర్చు చేశారు. మూడేళ్లపాటు ఉపాధిహామీ ఆధ్వర్యంలో పండ్ల మొక్కల నిర్వహణ బాధ్యత చేపట్టగా మొక్కలు ఏపుగా పెరిగి కాతదశకు చేరుకున్నాయి. మూడేళ్ల అనంతరం మొక్కల నిర్వహణ బాధ్యతను గ్రామపంచాయతీకి అప్పగించారు. పంచాయతీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పండ్ల మొక్కల నిర్వహణను గాలికి వదిలేయడంతో అవి పూర్తిగా ఎండిపోయాయి. మొక్కలకు ఏర్పాటు చేసిన పైపులైన్ మంటల్లో కాలిపోయింది. బోరుబావి వృథాగా ఉండిపోయింది. మొక్కల చుట్టూ ఏర్పాటు చేసిన ఇనుప కంచె దెబ్బతింది. రూ.లక్షల ప్రజాధనం వృథా అవడంతోపాటు పండ్ల మొక్కల జాడ కానరాక కోతులు అటవీ బాట పట్టే నినాదం కాస్తా నీరు గారిపోయింది.

# పెరగనున్న కేజీబీవీలు..!

మిర్యాలగూడ : జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పది చోట్ల జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేసేందుకు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. నల్గొండ జిల్లాలో 26 కేజీబీవీలు ఉండగా 14 చోట్ల ఇంటర్ కళాశాలలు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు అదనంగా మరో 12 చోట్ల తరగతులు ప్రారంభించాలని నిర్ణయించారు. గతంలో ఉన్న కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ ఒక విభాగం, సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ(మహిళ) కోర్సులు ఆయా కళాశాలల సౌకర్యాలను బట్టి అనుమతించారు. ఈ ఏడాది నూతనంగా ఏర్పాటు



చేయనున్న కళాశాలల్లో సైతం ఇవే కోర్సులను అనుమతించారు. ఒక్కో తరగతిలో 40 మంది విద్యార్థులను చేర్చుకునే అవకాశం ఉండగా ప్రథమంలో 80 ద్వితీయంలో 80 కలిపి ఇంటర్మీడియట్‌లో 160 సీట్లుగా నిర్ణయించారు. ఇప్పటి వరకు దామరచర్ల, మిర్యాలగూడ, శెట్టిపాలెం, వేములపల్లి, తిప్పర్తి, కట్టంగూరు, మునుగోడు, మర్రిగూడ, నాంపల్లి, దేవరకొండ, అనుముల, పెద్దవూర, చెరుకుపల్లి, చందూరులో ఇంటర్ కోర్సులు నిర్వహిస్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి కనగల్, నిడమనూరు, పీఏపల్లి, మల్లేపల్లి, గుర్రంపోడు, డిండి, తిరుమలగిరి సాగర్, నేరేడుగొమ్ము, అడవిదేవులపల్లి, చందంపేట, శాలిగౌరారం, చింతపల్లి కేజీబీవీల్లో తరగతులు ప్రారంభించనున్నారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభంలో తరగతులు ప్రారంభించేలా ఏర్పాటు చేస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి భిక్షపతి తెలిపారు. బాలికలకు అన్నిరకాల వసతులు కల్పిస్తున్నందున గ్రామీణ ప్రాంతాల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మేలు చేసే.. జీలుగ



నల్గొండ: వానాకాలం సీజన్ ప్రారంభం కానుంది. రైతులకు అవసరమైన విత్తనాలను సరఫరా చేసేందుకు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఏర్పాట్లు ముమ్మరం చేసింది. తొలుత రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు అందించేందుకు చర్యలు చేపట్టింది. వీటిలో ప్రధానమైన జీలుగ విత్తనాలను ఇతర రాష్ట్రాలైన పంజాబ్, ఢిల్లీ హరియాణాల నుంచి దిగుమతి చేసుకుంటుంది. జనములను ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుతో పాటు మన రాష్ట్రంలోని సిద్దిపేట నుంచి తెప్పించారు. పిల్లిపెసరలు అత్యధికంగా సిద్దిపేట నుంచే వస్తున్నాయి. వీటిని నల్గొండ జిల్లాలోని విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల రైతులకు సరఫరా చేయనుంది. పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం రాయితీపై సరఫరా చేస్తున్నారు. రైతులు విచ్చలవిడిగా యూరియా వాడుతున్నందున దాని వినియోగం తగ్గించేందుకు ప్రభుత్వం పెద్దఎత్తున రాయితీపై ఈ విత్తనాలను సరఫరా చేస్తోంది. వీటిని ఎకరాకు 10-15 కిలోల చొప్పున చల్లాలి. 30 రోజుల్లోనే ఏపుగా ఎదిగి పూత దశకు వస్తాయి. ఈ సమయంలో పొలంలో కలియదున్నాలి. అనంతరం ఫాస్ఫేట్‌ను చల్లితే మొక్కలు పూర్తిగా కుళ్లిపోయి ఎకరాకు 10 క్వింటాళ్ల పచ్చిరొట్ట తయారవుతుందని వ్యవసాయాధికారులు తెలిపారు.

ప్రభుత్వ సబ్సిడీపై సరఫరా చేసే పచ్చిరొట్ట విత్తనాలు ఆయా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్, విత్తానాభివృద్ధి సంస్థ, ఆర్ఎం వినయ్ తెలిపారు.

# మెట్రో మోత



హైదరాబాద్ : మెట్రో రైలు ఛార్జీలను పెంచారు. కొత్త ధరలు అమలులోకి వచ్చాయి. పెరుగుదల 20 నుంచి 42 శాతం వరకు ఉంది. ఛార్జీలనే కాదు దూరం కుదించి శ్లాబులను మార్చడంతో మధ్య శ్లాబుల్లో ఉన్న ప్రయాణికులపై పెంపు భారం అధికంగా ఉంది. కనిష్ఠ ఛార్జీని రూ.10 నుంచి 12కి, గరిష్ఠాన్ని రూ.60 నుంచి రూ.75కి పెంచినట్లు ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ గురువారం వెల్లడించింది.

**కమిటీ సిఫార్సుతో...:** హైదరాబాద్ మెట్రో రైలు 2017 నవంబరు 28న ప్రారంభమైంది. అప్పుడు నిర్ణయించిన ప్రయాణ ఛార్జీలే దాదాపుగా ఏడున్నరేళ్లుగా కొనసాగుతున్నాయి. 2022 సెప్టెంబరు 5న మెట్రో రైల్వేస్ ఛార్జీలను సిఫార్సు చేసేందుకు హైకోర్టు మాజీ న్యాయమూర్తి సారథ్యంలో ఫేర్ ఫిక్సేషన్ కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ 2023 జనవరి 25న ఛార్జీల సవరణకు సిఫార్సు చేస్తూ నివేదిక ఇచ్చింది. ఎన్నికల ఏడాది కావడంతో అప్పటి ప్రభుత్వం ఛార్జీల పెంపునకు సమ్మతి తెలపలేదు. ఇటీవల బెంగళూరులో మెట్రో ఛార్జీలు పెంచడంతో ఇదే అదనుగా సర్కారుపై ఒత్తిడి తెచ్చింది. సానుకూల స్పందన రావడంతో ఛార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

**సగటున 28 శాతం**

ఛార్జీల పరంగా పది శ్లాబులు ఉన్నాయి. ఇందులో మార్పు లేకున్నా... పలు శ్లాబుల్లో దూరం కుదించారు. ఇదివరకు 6-8 కి.మీ. శ్లాబు ఉండగా.. దాన్ని ఇప్పుడు 6-9 కి.మీ.కు.. 10-14 కి.మీ. శ్లాబును 12-15 కి.మీ.కు మార్చారు. చివరి శ్లాబు 24 కి.మీ.ఆపైన ఉండగా.. దాన్ని 26 కి.మీ. ఆపై దూరానికిగా సవరించారు. ప్రస్తుతం 25 కి.మీ. దూరం ప్రయాణిస్తే ఛార్జీ రూ.55 ఉండగా.. ఇకపై రూ.75 అవుతుంది. ఏకంగా 36 శాతం అదనపు భారం పడుతుంది. 10 కి.మీ. దూరానికి ఇప్పుడు రూ.35లు కాగా.. సవరించిన ఛార్జీలతో రూ.50కి చేరింది. పెంపుభారం 42 శాతంగా ఉంది. ఇది సగటున 28 శాతం వరకు ఉంది. ఈ సవరణతో వార్షికంగా రూ.100 కోట్ల పైనే అదనపు ఆదాయం వస్తుందని ఎల్ అండ్ టీ సంస్థ అంచనా వేస్తోంది.

**ఛార్జీల పెంపు రద్దుకు డిమాండ్**

మెట్రోరైల్ ఛార్జీల పెంపుదలను సీపీఎం నగర కమిటీ ఖండించింది. ఈ మేరకు ప్రకటనల విడుదల చేసింది. ఈ పెంపుదలతో సామాన్య ప్రజానీకంపై తీవ్ర భారం పడుతుందని, పెంపుదలను రద్దు చేయాలని డిమాండ్ చేసింది. ఆదాయం రాబట్టుకోలేకపోవడం సంస్థ వైఫల్యమని కార్యదర్శి ఎం.వెంకటేష్ ప్రశ్నించారు.

## ఇంకేది.. ఇంకెప్పుడు..

హైదరాబాద్ : నగరంలో భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్నాయి. సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతున్నా ఈ పరిస్థితి ఎదురవుతోంది. దీనికి కారణం నీరు భూమిలోకి ఇంకకపోవడమే. అయినా ఇంకుడు గుంతల విషయంలో అధికారుల ఉదాసీనత వీడటం లేదు. కొత్తవి పక్కనపెడితే ఉన్నవి సైతం నిర్వహణకు నోచుకోవడం లేదు. నగరంలోని పార్కులు, విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయ ఆవరణల్లో 2016లో సుమారు 7 వేల వరకు ఇంకుడుగుంతలు నిర్మించారు. ఇందులో చాలావరకు మట్టి, రాళ్లు, ఇతర వ్యర్థాలతో నిండిపోయాయి. వీటిని కనీసం రెండు, మూడేళ్లకోసారైనా పునరుద్ధరించుకోవాలి. ఇంకుడు గుంతలను నిర్మించి వాటికి జియోట్యాగింగ్ చేసి నిర్వహణపైనా దృష్టిసారించాలని అనుకున్నారు. కానీ వాటి ఏర్పాటుపై తీసుకున్న శ్రద్ధ నిర్వహణపై పెట్టకపోవడంతో నిధులన్నీ



వృథా అయ్యాయి. కొన్నిచోట్ల వీటి ఫలితాలు కనిపించగా.. తరువాత వారు కూడా వదిలేయడంతో ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి.

**మట్టి, చెత్తతో నిరుపయోగంగా**

సాధారణంగా ఇంకుడుగుంతలను అందుబాటులోని స్థలం ఆధారంగా ఏర్పాటు చేస్తారు. సుమారు మీటరున్నర నుంచి రెండు మీటర్లలోతు వరకు తవ్వుతారు. తరువాత వివిధ పరిమాణాల్లో రాళ్లు, కంకర, ఇసుకను పొరలుగా వేస్తారు. పైభాగంలోని ఇసుక వాననీరు లోపలికి ఇంకేలా చేస్తుంది. వర్షపునీటితో పాటు మట్టి ఇతర వ్యర్థాలు కూడా చేరుతాయి. వీటి పరిమాణం పెరిగే కొద్దీ భూమిలో నీరు ఇంకే పరిస్థితి తగ్గిపోతుంది. నిర్వహణ లేకుంటే పూర్తిగా నిరుపయోగంగా మారుతుంది. పరిమాణం మేరకు రూ.2 వేల నుంచి రూ.10 వేలు వెచ్చిస్తే వినియోగంలోకి వచ్చే అవకాశం ఉన్నా పట్టించుకోకపోవడంతో భూగర్భ జలాలు భూమిలో ఇంకడం అంతకంతకు తగ్గిపోతోందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. యంత్రాంగం స్పందించాలి.

## సేకరణ సాగక..

## బైపాస్ పూర్తికాక..

తాండూరు: జిల్లాలో వ్యాపార, వాణిజ్య పట్టణంగా పేరున్న తాండూరులో సగంలోనే ఆగిపోయిన బైపాస్ రోడ్డు పనుల్లో పురోగతి కనిపించడం లేదు. అన్ని వాహనాలు పట్టణం నడిబొడ్డు నుంచే రాకపోకలు సాగించడంతో స్థానికులు తరచూ ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు ప్రాణవాయువు కూడా కాలుష్యకారకంగా మారుతోంది.

**ఇవీ వివరాలు..**

మంజూరైన నిధులు: రూ.78 కోట్లు
పనులు ప్రారంభం: 2017
రోడ్డు పొడవు: 12 కి.మీ.
మొత్తం భూ సేకరణ: 99.28 ఎకరాలు
ఇందులో రైతుల పట్టా భూములు: 87.26 ఎకరాలు
ప్రభుత్వ భూమి: 12.02 ఎకరాలు
రైతుల నుంచి స్వాధీనం చేసుకోవాల్సిన భూమి: 17.20 ఎకరాలు
భూములు కోల్పోయిన రైతులు: 189 మంది
రైతులకు చెల్లించే పరిహారం నిధి: రూ.21.87 కోట్లు

ట్రాఫిక్, కాలుష్య చిక్కులు పరిష్కరించాలని..
ట్రాఫిక్, కాలుష్య సమస్యల పరిష్కారానికి పట్టణం వెలుపలి నుంచి



బైపాస్ రోడ్డు నిర్మాణం తప్పదని రహదారులు, భవనాల శాఖ ఎనిమిదేళ్ల కిందట నిర్ణయించింది. ఆ మేరకు ప్రతిపాదనలు పంపించడంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. నిర్ణీత భూసేకరణలో కొంత భూమిని రైతుల నుంచి అధికారులు ఇంకా స్వాధీనం చేసుకోలేదు. దీంతో పనులు సాగడంలేదు.

**వివాదాస్పద పొలాలు వదిలేసి...**

గౌతాపూరు శివారు నుంచి అంతారం గ్రామ శివారు పెద్దేముల్ వైపు వెళ్లే ప్రధాన రోడ్డును అనుసంధానించే వరకు రోడ్డు పూర్తయింది. ఇక్కడి నుంచి బషీర్‌మియా తండా వైపు వెళ్లే రోడ్డు నిర్మాణానికి సంబంధించిన పొలం చుట్టూ సంబంధిత రైతు కంచె ఏర్పాటు చేశారు. దీంతో గుత్తేదారు ఇక్కడ పనులను ఆపేశారు. వివాదాస్పద పొలాన్ని వదిలేసి అధికారులు స్వాధీనం చేసుకున్న పొలాల్లోంచి రోడ్డు వేయడానికి కంకర పరచి వదిలేశారు. ఓ రైతుకు సంబంధించిన వ్యవసాయ క్షేత్రం నుంచి చేపట్టాల్సిన పనులు ఇంకా ప్రారంభం కాలేదు. గుత్తేదారు కోకట్ చెరువులో వంతెన పనులు చేపట్టారు. ఇవి అసంపూర్తిగా మిగిలి పోయాయి. సమస్య ఉన్నతాధికారుల పరిధిలో ఉందిబైపాస్ రోడ్డు నిర్మాణానికి భూ స్వాధీనం పూర్తయితేనే పనులు పునః ప్రారంభమవుతాయి. ఈ వ్యవహారం ఉన్నతాధికారుల పరిధిలో ఉంది. శ్రావణ్‌కుమార్, సహాయ ఇంజినీరు, రోడ్లు, భవనాల శాఖ, తాండూరు.

## ప్రత్యేక వైద్యం.. ఆదరణ శూన్యం!



హైదరాబాద్ : భిక్షపతి వయస్సు 70కి పైనే. ఊరు కొమురెల్లి. అస్వస్థతకు గురి కావడంతో కుటుంబ సభ్యులు స్థానికంగా ఆసుపత్రిలో చూపిస్తే...గుండెలో సమస్య ఉన్నట్లు గుర్తించారు. వెంటనే గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేశారు. వైద్యులు గాంధీలోని జిరియాట్రిక్(వయోవృద్ధులకు అందించే ప్రత్యేక వైద్య సేవలు) వార్డులో చేర్పించారు. అక్కడే 20 రోజులుగా అన్ని రకాల చికిత్సలు అందిస్తున్నారు. మొత్తం వార్డులో ప్రస్తుతం ఆయన ఒక్కరే చికిత్స తీసుకుంటున్నారు.

**60 ఏళ్లు దాటిన వారికి...** ఆరు పదులు దాటినవారు ఏదైనా శారీరక రుగ్మత బారినపడి ఆసుపత్రి కి వస్తే వారికి మానసికంగా, శారీరకంగా సాంత్వన కల్పిస్తూ వైద్యాన్ని అందించాలనేది ఈ సేవల ప్రధాన ఉద్దేశం. ఇందులో భాగంగా మహిళలు, పురుషులకు వేర్వేరుగా చెరో 20 పడకలతో వార్డులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం గాంధీ ఆసుపత్రిలో అన్ని వయసుల వారికి వైద్య సేవలందిస్తున్నారు. అందులో వృద్ధులు కూడా చికిత్స తీసుకుంటున్నారు. మిగతా రోగులతో కలిపి వీరికి చికిత్స చేయడంతో వీరిపై ప్రత్యేకంగా దృష్టిపెట్టడం కుదరడం లేదు. ఈ నేపథ్యంలోనే జిరియాట్రిక్ వార్డులు తెరపైకి వచ్చాయి. వృద్ధులకు సౌకర్యవంతంగా వార్డులు రూపొందించారు. వారికిచ్చే ఆహారం విషయంలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం పురుషుల వార్డులో ఒక్కరే చికిత్స తీసుకుంటుండగా మహిళల వార్డులో రోగులు అసలే లేరు.

**ప్రచారం లేక..** గాంధీలో ప్రత్యేకంగా ప్రారంభించిన జిరియాట్రిక్ వైద్య సేవలు వెలవెలబోతున్నాయి. దీని గురించి తెలియక పోవడం ఒక కారణమైతే...ప్రచారం లేకపోవడం మరో కారణం. సాధారణ వార్డుల వద్ద ఓపీ సేవల కోసం చాలామంది వృద్ధులు నిరీక్షిస్తున్నారు. గంటల తరబడి అక్కడే పడిగాపులు పడుతున్నారు.

**ప్రత్యేక వైద్య బృందం..** ఆసుపత్రిలోని జనరల్ మెడిసిన్ విభాగానికి అనుసంధానంగా ఉండే జిరియాట్రిక్ (వృద్ధుల) విభాగానికి 4 పీజీ సీట్లు మంజూరయ్యాయి. ఈ విభాగంలో విధులు నిర్వహించేందుకు ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లతోపాటు ఇద్దరు సీనియర్ రెసిడెంట్లు, జూనియర్ వైద్యులు, 30 మంది స్టాఫ్‌నర్సులు, ఫిజియోథెరపిస్టులు అవసరమని భావించిన యంత్రాంగం వారిని కేటాయించే ప్రక్రియను చేపట్టింది.

## పీఎం కిసాన్.. కొందరికే సహాయం

బొంరాస్‌పేట: రైతులకు పెట్టుబడి సహాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీఎం కిసాన్ పథకం వల్ల జిల్లాలో కొందరు రైతులకు మాత్రమే ప్రయోజనం కలుగుతోంది. 2019 జనవరి 31 వరకు పట్టాదారు పాసు పుస్తకాలు కలిగి ఉన్న సన్న, చిన్నకారు రైతులనే ఈ పథకానికి అర్హులుగా గుర్తించి సాగుకు పెట్టుబడిగా ఏటా మూడు విడతల్లో కలిపి రూ.6 వేలు రైతుల ఖాతాలలో కేంద్ర ప్రభుత్వం జమ చేస్తోంది. ఆ తరువాత పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులు ఈ పథకంలో చేరదామంటే నమోదుకు అవకాశం ఇవ్వడం లేదు. దీంతో చాలా మంది సన్న, చిన్నకారు రైతులు పెట్టుబడి సహాయానికి దూరమవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుభరోసా పథకం కింద అందరు రైతులకు పెట్టుబడి సహాయం అందిస్తుండగా ఏటా కొత్త వారు పథకంలో చేరడానికి అవకాశం కల్పిస్తున్నారు. కేంద్ర పథకంలో ఆ అవకాశం లేక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఏటా తగ్గుతున్న లబ్ధిదారులు**

ఈ పథకంలో ఏటేటా లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. పథకంలోని లబ్ధిదారులు చనిపోతే నిబంధనల ప్రకారం ఆ భూమిని పంచుకున్న వారసులకు పథకం వర్తింప చేయాలి. అది అమలు కావడం లేదు. పథకం ప్రారంభించినప్పుడు జిల్లాలో 1.60 లక్షల మంది లబ్ధిదారులు ఉండగా ఏడేళ్లలో సగానికిపైగా తగ్గి 73,840కు చేరుకుంది. రూపొందించిన నిబంధనల ప్రకారం 2023లో కటాఫ్ తేదీ పెంచాల్సి ఉన్నా కేంద్రం పెంచలేదు. దీంతో కొత్త వారికి అవకాశం లేకుండా పోయింది.

**విశిష్ట గుర్తింపు కార్డుపై ఆశలు:** ఆధార్ కార్డు తరహాలోనే రైతులకు



11 అంకెల విశిష్ట గుర్తింపు కార్డును జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. వీటి ద్వారానే ప్రభుత్వ పథకాలను అమలు చేయాని నిర్ణయించింది. ఈ ప్రక్రియ ఇటీవలే రాష్ట్రంలో ప్రారంభమైంది. గుర్తింపు కార్డు కోసం వ్యవసాయశాఖ అధికారులు రైతుల పేర్లను నమోదు చేస్తున్నారు.

**ఇవీ పథకం వివరాలు**

పీఎం కిసాన్ ప్రారంభం - 2019, ఫిబ్రవరి.
ఏటా మూడు విడతల్లో అందించే పెట్టుబడి సహాయం -రూ.6 వేలు.
ఇప్పటివరకు 19 విడతల్లో జిల్లాలో రైతులకు అందించిన సహాయం- రూ.499.10 కోట్లు.
జిల్లాలో మొత్తం రైతులు -2,97,000.
2025, జనవరిలో పెట్టుబడి సహాయం అందుకున్న రైతులు- 73,840.

## మామిడితో బాట సింగారం

రంగారెడ్డి : ఫలాల్లో రాజుగా పేరుగాంచిన మామిడి క్రయవిక్రయాల్లోనూ రాజసం ప్రదర్శిస్తోంది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలోని పండ్ల మార్కెట్లో ఈ ఏడాది సీజన్ ఆరంభం నుంచే మామిడి జోరు కొనసాగుతోంది. క్రయవిక్రయాలు ఇప్పటికే 81వేల టన్నుల మార్కును దాటేసింది. దీంతో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీకి కాసుల పంట పండుతోంది. బంగినపల్లిదే హవా..! : తెలుగు రాష్ట్రాల్లోని వివిధ జిల్లాల నుంచి బాటసింగారం మార్కెట్‌కు మామిడి పెద్ద ఎత్తున వస్తోంది. ప్రస్తుతం 11 రకాల మామిడి వస్తున్నట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అందులో రుచిలో రారాజు బంగినపల్లి (బెనిషాన్)దే అగ్రభాగమని చెప్పాలి. వచ్చే మామిడిలో 85 శాతం ఆ రకమే కావడం గమనార్హం. ఇక్కడికి వచ్చిన మామిడిని గ్రేడింగ్ చేసి నిబంధనల మేరకు ప్యాక్ చేసి వివిధ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. మార్కెట్‌కు వచ్చే మామిడిలో సుమారు 70 శాతం ఇతర ప్రాంతాలకు ఎగుమతి



అవుతుండగా.. మిగతాది స్థానికంగా విక్రయమవుతోంది. బాటసింగారం మార్కెట్‌కు వచ్చే మామిడిలో అగ్రభాగం బంగినపల్లిది కాగా.. తరువాత స్థానాల్లో దసేరి, నాటి, తోతాపురి, రసాలు, కేసరి, హిమాయత్, మల్లిక, సుందరి తదితర రకాలున్నాయి.

ఎగుమతులు ఎక్కడికంటే..: ఇక్కడి వ్యాపారులు మామిడిని కొనుగోలు చేసి రాజస్థాన్, పంజాబ్, కర్ణాటక, హర్యానా, మహారాష్ట్ర, గుజరాత్, దిల్లీ, యూపీ, ఎంపీ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.

నిరంతర పర్యవేక్షణ పండ్ల మార్కెట్లో రైతులకు, వ్యాపారులకు అవసరమైన ఏర్పాట్లు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. మామిడి రికార్డు స్థాయిలో వస్తోంది. వ్యాపారం సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాం. రైతులు, వ్యాపారులు ఎలాంటి ఆటంకాలు లేకుండా క్రయవిక్రయాలు జరుపుతున్నారు. ఈ ఏడాది ఇప్పటికే రూ.2.37 కోట్ల ఆదాయం మార్కెట్‌కు వచ్చింది. చిలుక మధుసూదన్‌రెడ్డి, ఛైర్మన్, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ

## వన్యప్రాణుల విలవిల..
## సందర్శకుల్లేక వెలవెల

కరీంనగర్ : వేసవి ఎండల ప్రభావంతో జిల్లా పర్యాటక స్థలాలు, పార్కులు బోసిపోతున్నాయి. వన్యప్రాణులు కూడా విలవిలలాడుతున్నాయి. జిల్లా కేంద్రంలోని జింకల పార్కు, ఎల్‌ఎండీ బోటింగ్ కేంద్రాలు, పరిసరాలు పొద్దంతా నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. జింకల పార్కులో ఈము పక్షి, కుందేళ్లు, నెమళ్లు, తాబేళ్లు, రామచిలుకలు, పావురాలు, టర్కీ కోడి, అమెరికా కోడి, మూడు రకాల జింకలు ఉన్నాయి. ఎండలకు అవి తట్టుకోలేకపోతున్నాయి. అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు వేడి నివారణ చర్యలు చేపడుతున్నారు. షెడ్డుపై తుంగ గడ్డితోపాటు పక్కలకు గన్నీ సంచులు వేలాడదీసి నీళ్లు పడుతున్నారు. జింకలు పొద్దంతా చిట్టడవిలోని చెట్ల కిందనే సేద తీరుతున్నాయి. వాటికి ఫీడింగ్ కూడా ఉదయం, సాయంత్రం ఇస్తున్నారు. షెడ్లలో ఉన్న వాటికి నీళ్లు, తాజా ఆహారం అందిస్తున్నారు.ఎండ వేడికి బోటింగ్



చేయడానికి ఎవరూ రావడం లేదు. సాయంత్రం 5 గంటలు అయినా ఎండ ఉండటంతో పిల్లల పార్కులో ఆడుకోవడానికి కూడా రావడంలేదు. సాయంత్రం 6 తర్వాత, ఉదయం 9 గంటలలోపు మాత్రమే కొంతమంది మాత్రమే వస్తున్నారని అధికారులు తెలిపారు.

**జాగ్రత్తలు తీసుకుంటున్నాం**

ఎండలు మండిపోతున్నాయి. వన్యప్రాణులకు తగు నీడ ఉండేలా చూస్తున్నాం. మధ్యాహ్నం వేళ షెడ్లపై నీటిని చల్లిస్తున్నాం. తాగునీటిలో ఎలక్ట్రాల్ పౌడర్‌తోపాటు దాణాలో ఖనిజ లవణ మిశ్రమాలను రోజు అందిస్తున్నాం. ఎప్పటికప్పుడు వైద్యులతో ఆరోగ్య జాగ్రత్తలు తీసుకుంటున్నాం.ఆనంద్‌కుమార్, అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారి

## వేలల్లో ఒక్కరికే..!

నల్గొండ : కొత్త రేషన్‌కార్డుల కోసం జిల్లావ్యాప్తంగా వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుత బీసీ కులగణనలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేసి కొందరికే ఇవ్వడంతో మిగతావారికి ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో కొత్త రేషన్‌కార్డుల కోసం, కుటుంబసభ్యుల పేర్లు చేర్పించడానికి, కార్డుల విభజనకు ప్రజలు అర్జీలు పెట్టుకున్నారు. సుమారు లక్ష వరకు వచ్చాయి. వీటిని పరిశీలించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పంచాయతీ కార్యదర్శులకు ఓ మొబైల్ యాప్‌ను అందజేశారు. రెండు నెలల క్రితం దరఖాస్తులను పరిశీలించిన కార్యదర్శులు వాటిని పైస్థాయి అధికారులకు పంపించారు. కానీ ఇప్పటివరకు అర్హులకు రేషన్‌కార్డులు జారీ కాలేదు. కుటుంబసభ్యుల పేర్లు నమోదు కాలేదు. దీంతో వారంతా తహసీల్దార్, పౌరసరఫరాల శాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ దరఖాస్తుల స్థితి(స్టేటస్) తెలుసుకోవడానికి వీలు లేకుండాపోయింది.

**8,750 మందికే కొత్త కార్డులు** జిల్లాలో కొత్తగా 8750 మంది ఆహారభద్రతా కార్డులు మంజూరు చేశారు. ఇప్పటికే ఉన్న కార్డుల్లో పిల్లలను చేర్చేందుకు గతంలో మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకుని డీఎస్‌వో పెండింగ్ అని చూపించిన వాటిని సవరించారు. దీంతో కొత్తగా 61,247 (యూనిట్లు) మంది లబ్ధిదారులు పెరిగారు. కొత్తవారికి ఈనెల రేషన్ కోటా కింద 3674.82 క్వింటాళ్ల సన్న బియ్యం విడుదల చేశారు.

# నీరు నిలుపు.. సాగుకు మలుపు

తాండూరు : తాండూరు శివారులోని కాగ్నా నదికి వరదలొచ్చినప్పుడు ఆనకట్టలు లేక నీరంతా దిగువకు వృథాగా వెళ్లిపోయేది. కళ్లముందే పొలాలకు పారాల్సిన నీరు ఇలా నేలపాలవుతుంటే రైతులు తీవ్ర ఆవేదనకు లోనయ్యేవారు. అడ్డుకట్టలు కడితే కొంతమేరకైనా వృథాను అరికట్టవచ్చని నీరు నిలిచి పొలాలకు పారించి పంటలు పండించుకోవచ్చని రైతులు అధికారులకు పదేపదే విన్నవించేవారు. ఎట్టకేలకు వారి కృషి ఫలించింది. తాజాగా వరద నీరు వృథాగా పోకుండా అధికారులు ఆనకట్టలు నిర్మిస్తున్నారు.

**రూ.10 కోట్లవ్యయం:** ఇప్పటికే నదిలో దిగువ, ఎగువ రెండు ఆనకట్టల్ని నిర్మించారు. రూ.10 కోట్ల వ్యయంతో కొత్తగా కట్టలు నిర్మిస్తున్నారు. వర్షా కాలంలో కురిసే వానకు నదిలోకి భారీగా వచ్చే వరద నీరు వృథాగా అటుఇటూ వెళ్లకుండా మరో కట్టను నిర్మిస్తున్నారు. తాండూరు- కొడంగల్ మార్గంలోని వంతెనకు ఎగువన కొత్తగా నిర్మించిన ఆనటక్ట వద్ద వరద నీరు నిల్వటానికి అధికారులు రెండు వైపులా మరో కట్టను ఏర్పాటు చేస్తున్నారు. వరద నీరు వచ్చినప్పుడు ఇది వరకు నదీ పరివాహక ప్రాంతాల్లోకి వెళ్తూ పంట పొలాలను దెబ్బతీసేది. నదికి రెండు వైపులా కట్టలు ఏర్పాటు చేస్తుండటంతో



వరద నీరు ఆనకట్ట వద్దే నిల్వ ఉంటుంది.

**కొడంగల్‌కు మెరుగైన తాగునీటి సరఫరా..**

ఇక్కడి ఆనకట్ట నుంచే కొడంగల్ నియోజకవర్గానికి తాగు నీటిని సరఫరా చేస్తున్నారు. ఇందులో భాగంగానే నీటి సరఫరా మరింత మెరుగు కోసం ఆనకట్టకు రెండు వైపులా రెండు కిలో మీటర్ల పొడవునా కొత్తగా మట్టి కట్టలు ఏర్పాటు చేస్తున్నారు. పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వచ్చే వర్షా కాలం నాటికి పూర్తి చేసే విధంగా వేగంగా చేస్తున్నారు. నదిలోని మట్టినే తీసి కట్టలు ఏర్పాటు చేస్తున్నారు. నది మధ%రి%్యలో ఆనకట్ట, రెండు వైపులా మట్టి కట్టలతో వరద నీరు భారీగా నిల్వ ఉండటానికి అవకాశాలు ఉన్నాయి. దీంతో ఆ ప్రాంతంలో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగి సాగు, తాగు నీటికి ఇబ్బందులు ఉండవని అధికారులు వివరిస్తున్నారు.

# పశుపోషకులకు బాసట

చొప్పదండి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పశువుల షెడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గతంలో గ్రామీణాభివృద్ధి పనులకు ప్రాధాన్యమివ్వగా.. ఈసారి వాటికి భిన్నంగా వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి కృషి చేయాలని భావించింది. వేసవిలో జల సంరక్షణకు ఇంకుడుగుంతలు, చేపల కొలనుతోపాటు పాడి రైతుల కోసం ప్రత్యేకంగా షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు.

**నాలుగు పశువులు ఉంటేనే..**

గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు ఉపాధిహామీ జాబ్‌కార్డు కలిగి ఉండి కనీసం నాలుగు పశువులను కలిగి ఉంటేనే షెడ్ల నిర్మాణానికి అనుమతినిస్తారు. పశువుల షెడ్డుతోపాటు దాని పక్కనే తాగునీటి ట్యాంకు, పశుగ్రాసం నిల్వ చేసుకునేందుకు ప్రత్యేక గదిని సైతం నిర్మిస్తున్నారు. ఇప్పటివరకు చిన్న, సన్నకారు రైతులు తమ పశువులను పొలాల వద్ద చెట్ల కింద కట్టేసేవారు. దీంతో వాటి ఆరోగ్యంపై వాతావరణ పరిస్థితులు ప్రభావం చూపడంతో వ్యాధుల బారినపడేవి. ఈ సమస్యను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పశువుల షెడ్ల నిర్మాణానికి



అనుమతినివ్వడంతో వారి కష్టాలు తీరనున్నాయి.

**రూ.లక్ష వరకు కేటాయింపు**

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 926 షెడ్ల నిర్మాణానికి అనుమతి రాగా.. ఇప్పటివరకు 336 నిర్మించారు. మిగతావి ప్రగతిలో ఉన్నాయి. ఈనెలాఖరు వరకు వీటన్నింటిని పూర్తి చేసేలా ఉపాధిహామీ సిబ్బంది కసరత్తు చేస్తున్నారు. ఈ దిశగా క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు కేటాయిస్తున్నారు.

**సద్వినియోగం చేసుకోవాలి : శ్రీధర్, డీఆర్డీవో కరీంనగర్**

పాడి రైతులకు పశువుల షెడ్ల నిర్మాణంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. వాటిని సద్వినియోగం చేసుకోవాలి. మార్చి 31 లోగా వీటైనన్ని పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నాం. ఇవి పాడి రైతుకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి.

# సన్నబియ్యంతో సంతృప్తికరంగా భోజనం..!

కొత్తగూడెం: పేదలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉగాది (ఈనెల 30) నుంచి రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం అందిస్తామని హామీ ఇచ్చిన నేపథ్యంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల పౌరసరఫరాలశాఖ అధికారులు సన్నాహాలు మొదలుపెట్టారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న లబ్ధిదారుకు ప్రస్తుతం ఆరు కిలోల చొప్పున దొడ్డు బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇకపై వీటి స్థానంలో సన్నబియ్యం అందించనున్నారు. రైతుల నుంచి కొన్న సన్నధాన్యాన్ని మరపట్టించి తిరిగి నిరుపేదలకు పంపిణీ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.అక్రమాలకు అడ్డుకట్ట.. ఇన్నాళ్లు 'రేషన్' లబ్ధిదారులకు ప్రతినెలా దొడ్డు బియ్యం పంపిణీ చేశారు. అయితే అందులో ఎక్కువ శాతం మంది వాటిని తినలేక దళారులకు విక్రయించటంతో పథకం లక్ష్యం నీరుగారేది. లబ్ధిదారులు మార్కెట్‌లో సన్న బియ్యాన్ని కొనుగోలు చేస్తుండటంతో వాటి ధరలకు రెక్కలొస్తున్నాయి. ఈనేపథ్యంలో రేషన్‌కార్డుల ద్వారా ఉచితంగా సన్నబియ్యం అందించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. **ఏడు లక్షల కార్డులు.. 11వేల మె.ట. బియ్యం**ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 7,05,950 రేషన్‌కార్డులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటికి ప్రతినెలా సుమారు 11వేల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమని అంచనా వేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు ఇచ్చేందుకు, పాతకార్డుల్లో పేర్లు చేర్చేందుకు చర్యలు చేపట్టింది. దరఖాస్తుల విచారణ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఏప్రిల్‌లో కొత్తకార్డులు అందుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. ఇదే జరిగితే ఖమ్మం, భద్రాద్రి జిల్లాల బియ్యం కోటా పెంచాల్సి ఉంటుంది. సుమారు 60 నుంచి 70వేల వరకు కార్డులు, 3లక్షల వరకు యూనిట్లు పెరిగే అవకాశం ఉన్నందున కనీసం 2వేల మెట్రిక్ టన్నుల బియ్యం అదనంగా కావాలి.

# సిండికేట్.. కాదంటే వేటు



హైదరాబాద్: ఖైరతాబాద్ జోన్ పరిధిలో డ్రైవర్లు, ఇతర ఒప్పంద కార్మికుల సరఫరా కోసం పిలిచిన టెండర్లలో ఇద్దరు మాత్రమే గుత్తేదారులు పాల్గొన్నారు. అందులో ఒకరి టెండర్‌పై అనర్హత వేటు వేశారు. టర్నోవర్ 200శాతం లేదని నిరాకరించారు. ఇక మిగిలింది ఒకే ఒక్క టెండర్. దాన్ని 4.8శాతానికి ఆమోదించారు. ఒకే ఒక్క టెండర్ మిగిలితే రీకాల్ చేయాల్సి ఉంటుంది. కానీ అధికారులు ఈ ఒక్క జోన్‌లోనే అయిదు టెండర్లను ఆమోదించడం విశేషం.

**అది అక్కడ ఆనవాయితీ**

జీహెచ్ఎంసీలో ఒప్పంద ఉద్యోగులు, కార్మికుల సరఫరా టెండర్లలో గుత్తేదారులు సిండికేట్‌గా మారితే సరి.. లేకపోతే పోటీదారులపై అనర్హత వేటు వేసి టెండర్లను అప్పగించడం ఆనవాయితీగా మారింది. ఈ ఏడాదికి పిలిచిన టెండర్లన్నీ దాదాపు ఇదే విధంగా జరిగాయి. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు.. ఆరుజోన్ల పరిధిలో దాదాపు 25వేల మంది ఒప్పంద ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారు. అన్ని విభాగాలు కలిపి 350 టెండర్లను జోన్లలో పిలిచారు. ఇప్పటికే 300 టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. అన్నీ సిండికేట్‌కే దక్కాయి. వీటిలో 80శాతం టెండర్లను సింగిల్ టెండర్ ఆమోదించారు. అన్నీ 4.5శాతం నుంచి 4.9శాతానికి దక్కించుకున్నవే కావడం విశేషం. ఇటీవల ఒప్పంద కార్మికుల సరఫరా టెండర్లలో అక్రమాలను 'ఈనాడు' వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. కేవలం దక్షిణ మండల కార్యాలయం పరిధిలో మాత్రం నిబంధనలను సవరించారు. మిగిలిన అన్నింటిలోనూ ఏకపక్షంగా ఆమోదించేశారు. ఇంకా 50 టెండర్ల వరకు ఆమోదించాల్సి ఉంది.


**ఏళ్ల తరబడి వారే..**

జీహెచ్ఎంసీ పరిధిలో ఒప్పంద ఉద్యోగుల సరఫరా టెండర్లను ఏళ్ల తరబడి ఒకే గుత్తేదారు సొంతం చేసుకుంటున్నారు. గతంలో ప్రజాప్రతినిధిగా చేసిన ఓ నేత అనుచరులకే 50శాతం టెండర్లను దక్కించుకున్నారు. వాస్తవానికి మానవ వనరులను సరఫరా చేసే ఏ గుత్తేదారు అయినా అర్హులే. జీహెచ్ఎంసీలో మాత్రం ఆయా ప్రత్యేక విభాగాల్లో అనుభవం ఉన్నవారే అర్హులుగా పేర్కొంటున్నారు. ఇలా పాత వారికే టెండర్లు దక్కేలా చక్రం తిప్పారు.

**మాయాజాలం**

ఒప్పంద ఉద్యోగుల సరఫరాలో మస్టర్ల మాయాజాలం గుత్తేదారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. టెండర్లను దక్కించుకునేందుకే 1.50శాతం వరకు అధికారులకు కమీషన్లు ఇస్తున్నారు. ఇక నేతలకు మామూళ్లు సరేసరి. లేని కార్మికులను ఉన్నట్లు చూపించి వేతనాలు స్వాహా చేస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. బయోమెట్రిక్ విధానం, ముఖగుర్తింపు హాజరు.. ఇవన్నీ పక్కదోవ పట్టిస్తున్నారు. ఇన్ని అక్రమాలకు నిలయంగా మారిన ఒప్పంద ఉద్యోగుల, కార్మికుల సరఫరా టెండర్లలో ఉన్నతాధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

# జీతమెప్పుడు వస్తుంది?



వీర్నపల్లి : పల్లెల్లో వలసలను తగ్గించి స్థానికంగా ఉపాధి కల్పించాలన్న గొప్ప లక్ష్యంతో ఉపాధి హామీ పథకాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. గ్రామాల్లో పని గుర్తింపు మొదలు కూలీలకు వేతనాల చెల్లింపు వరకు వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఈజీఎస్ సిబ్బంది పాత్ర కీలకం. ముఖ్య పాత్ర పోషిస్తున్న సిబ్బందికి మూడు నెలలుగా వేతన బకాయిలతో కుటుంబాలు గడవడం ఇబ్బందిగా మారింది. నిత్యం ప్రజలతో సత్సంబంధాలు కలిగి ప్రభుత్వ విభాగాల్లో, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఒకటి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఏపీవోలు, ఇంజినీర్ కన్సల్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్‌లు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులతోపాటు కార్యాలయ సిబ్బంది కలిసి మొత్తం 248 మంది ఉన్నారు. ఆర్థిక సంవత్సరం మొదలు నుంచి ముగింపు వరకు జాబ్‌కార్డులున్న కూలీలకు పని కల్పనా లక్ష్యంగా సిబ్బంది పనిచేస్తున్నారు. గ్రామాల్లో పని గుర్తింపుతోపాటు అనుమతులు, తీర్మానాలు చేయడంతోపాటు ఉపాధి పని ప్రదేశంలో ఎలాంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా సేవలు అందేలా పర్యవేక్షణ చేస్తారు. ఈ ప్రక్రియలో ప్రధానంగా క్షేత్ర సహాయకులు పాత్ర కీలకం. పని ప్రదేశంలో కూలీల హాజరు, చిత్రాలు తీసి సంబంధిత యాప్‌లో నిక్షిప్తం చేస్తుంటారు. సాంకేతిక సహాయకుల జీతాలు సకాలంలో విడుదలవుతున్నట్లు అధికారులు చెపుతున్నారు. కానీ క్షేత్ర సహాయకులకు సంబంధించి జనవరి నుంచి వేతనాలు బకాయిలు ఉన్నాయి. మిగితా సిబ్బంది రెండునెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. కంప్యూటర్ ఆపరేటర్ నుంచి పీడీ వరకు వేతనాలు విడుదల కాలేదు.

**అప్పులు చేయాల్సి వస్తోంది**

ఎలాంటి వాతావరణ పరిస్థితులు ఉన్నా కూలీలకు పని కల్పించేందుకు కృషి చేస్తున్నాం. జనవరి నుంచి జీతాలు రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. చాలామంది క్షేత్ర సహాయకులు, ఈజీఎస్ సిబ్బంది ఇంటి అద్దె చెల్లింపు, నిత్యావసర సరకులు కొనుగోలు చేసేందుకు అప్పులు చేయాల్సి వస్తోంది. సకాలంలో వేతనాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

రాజునాయక్, క్షేత్ర సహాయుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు

**ప్రభుత్వం దృష్టిలో..**

ఈజీఎస్‌లో పని చేస్తున్న సిబ్బంది వేతనాలు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. ఈ సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉంది. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. కేంద్రం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది. రాగానే వారి ఖాతాల్లో జమ అవుతాయి. శేషాద్రి, డీఆర్‌డీవో

జిల్లాలో ఉపాధిహామీ వివరాలు

గ్రామ పంచాయతీలు :260

ఉపాధి హామీ కార్డులు :98133

నమోదైన కూలీలు :199721

సాంకేతిక సహాయకులు :34

క్షేత్రసహాయకులు :153


ఏపీవోలు :9 ఈసీఎస్‌లు :5

సీవోఎస్‌లు :19

# యంత్రంలోనే గుట్టు.. నకిలీ టిక్కెట్టు

హైదరాబాద్: ఆలయాల్లో నకిలీ టిక్కెట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పాయింట్ ఆఫ్ సేల్ (పీవోఎస్) యంత్రాల్లో సాంకేతిక లోపాలను ఆసరాగా చేసుకుంటూ సిబ్బంది 'డబుల్ నంబర్ టిక్కెట్ల'తో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. టిక్కెట్లను 'రీప్రింట్' చేస్తూ ఆ డబ్బును జేబులో వేసుకుంటున్న ఘటనలు పెరుగుతున్నాయి. ఇటీవల బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో ఈ వ్యవహారం వెలుగు చూడగా.. అంతకు ముందు కొమురవెల్లిలో వీఐపీ టిక్కెట్ల విక్రయాలు, బాసర ఆలయంలో లడ్డూ టిక్కెట్లలో అక్రమాలు చోటు చేసుకున్నాయి. 2023లో సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి ఆలయంలో ఒకే రోజు రూ.3వేలు జేబులో వేసుకొని ఇద్దరు ఉద్యోగులు దొరికిపోయారు. వారిపై చర్యలు తీసుకోకుండా వదిలేయడంతోపాటు పదోన్నతులు కల్పించారన్న ఆరోపణలున్నాయి.

**సాంకేతిక లోపాలు..** రాజధానిలోని ప్రముఖ దేవాలయాల్లో రోజూ సగటున 3వేల మంది, ప్రత్యేక రోజుల్లో 15వేల మంది భక్తులు వస్తుంటారు. పలురకాల అర్చనలతో పాటు ప్రసాదాలకు పీవోఎస్ యంత్రాల ద్వారా టిక్కెట్లు విక్రయిస్తున్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో, సాంకేతిక లోపాలు తలెత్తినప్పుడు ఒకే నంబర్‌తో రెండు టిక్కెట్లు ప్రింట్ అవుతున్నాయి. యంత్రంలో అమర్చే కాగితం అయిపోయే సమయంలోనూ ఇలా జరుగుతోంది. ఈ పరిస్థితితో కొందరు ఉద్యోగులు నకిలీ టిక్కెట్ల దందాకు తెరలేపుతున్నారు. రోజూ



50 నుంచి 100 టిక్కెట్లు జేబులో వేసుకున్నా.. నెలలో లక్షల రూపాయలు ఆలయ ఆదాయానికి గండికొట్టినట్టే. బల్కంపేట ఆలయంలో జనవరి 12న జరిగిన ఘటనను పరిశీలిస్తే...ఉద్యోగి రూ.31,550 కాజేసినట్లు గుర్తించి చర్యలు తీసుకున్నారు.

**థర్మల్ ప్రింటర్లు వినియోగిస్తే...**తాజా ఉదంతాలతోనూ కొన్ని ఆలయాల అధికారులు కళ్లు తెరవలేదు. ఇప్పటికీ పాయింట్ ఆఫ్ సేల్ యంత్రాలనే వినియోగిస్తూ టిక్కెట్లు జారీ చేస్తున్నారు. వీటి స్థానంలో థర్మల్ ప్రింటర్లు వినియోగిస్తే డూప్లికేట్ నంబర్ల సమస్య ఉండదన్న వాదనలు వినిపిస్తున్నాయి. అధునాతన సాంకేతికతతో పనిచేసే యంత్రాలను కొనుగోలు చేయాలంటే ఒక్కో ఆలయానికి రూ.5లక్షల వరకు ఖర్చవుతుందని ఈవోలు చెబుతున్నారు.

# ట్యాంకర్లు.. నిబంధనలకు నీళ్లు

హైదరాబాద్ : కాచిగూడలో అతివేగంగా వచ్చిన వాటర్ ట్యాంకర్ ఢీకొట్టడంతో ఐటీ ఉద్యోగి అక్కడికక్కడే మరణించాడు. షేక్‌పేట్ సమీపంలో అపసవ్యదశలో వచ్చిన ట్యాంకర్ ఆటోను ఢీకొట్టింది. అక్కడ చేరిన కొందరు ఆటోడ్రైవర్‌ను బెదిరించి వాటర్ ట్యాంకర్ డ్రైవర్‌ను అక్కడ నుంచి తప్పించారు. శేరిలింగంపల్లిలోని అపార్ట్‌మెంట్‌కు మురుగు నీరు సరఫరా చేసిన ట్యాంకర్ డ్రైవర్ నిలదీసిన వారిపైనే దౌర్జన్యానికి దిగినట్టు సమాచారం.

అడ్డూ అదుపు లేకుండా దూసుకెళ్తున్న వాటర్ ట్యాంకర్లు వాహనదారుల వెన్నులో వణకు పుట్టిస్తున్నాయి. తాగునీటి వాహనం వస్తుందంటే దారెంట ప్రయాణించేందుకు భయపడాల్సిన దుస్థితి నెలకొంది. భూగర్భ జలాలు అడుగంటడం, తాగునీరు చాలకపోవటంతో నగర పౌరులు ప్రత్యామ్నాయంపై ఆధాపడుతున్నారు. ఇదే అదనుగా సొమ్ము చేసుకునేందుకు వేలాది వాటర్ ట్యాంకర్లు బయటకొస్తున్నాయి. వీలైనంత ఎక్కువ ట్రిప్పులు తిరిగేందుకు డ్రైవర్లు ఇష్టానుసారం నడుపుతున్నారు. నెల వ్యవధిలోనే 15 రోడ్డు ప్రమాదాలకు ప్రైవేటు వాటర్ ట్యాంకర్లు కారణంగా పోలీసులు గుర్తించారు. 10 మంది గాయాలపాలవ్వగా, ముగ్గురు మృత్యువాతపడ్డారు. నీటి సరఫరా చేస్తున్నాయనే ఉద్దేశంతో అధికారులు చూసీచూడనట్టు వదిలేయటం



సామాన్యుల ప్రాణాలతో చెలగాటంగా మారింది.

**దూసుకొస్తున్నాయ్.. ప్రాణాలు తీస్తున్నాయ్**

అతివేగం, అనుభవలేమితో వాటర్ ట్యాంకర్ల డ్రైవర్లు అమాయకుల ప్రాణాలు బలితీసుకుంటున్నారు. నారాయణగూడ సమీపంలో జలమండలి వాటర్ ట్యాంకర్ ద్విచక్రవాహనంపై వెళ్తున్న కార్పెంటర్‌జగన్నాథంచారిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మరణించారు. మియాపూర్‌లో పని ముగించుకొని నడుచుకుంటూ వెళ్తున్న మాల్యాద్రి అతివేగంగా వచ్చిన ట్యాంకర్ ఢీకొని చనిపోయారు. కూకట్‌పల్లిలో ప్రైవేటు వసతి గృహంలోకి వాటర్ ట్యాంకర్ దూసుకెళ్లింది. ప్రహరీని ఢీకొట్టి ఆగిపోయింది. నిబంధనల విరుద్ధంగా నడిచే ట్యాంకర్లు, లైసెన్స్ లేని డ్రైవర్లను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తెలిపారు.

**మైనర్లే డ్రైవర్లు.. నంబర్‌ప్లేట్ కనిపించదు**

వేసవి వచ్చిందంటే తాగునీటి కటకట. రోజువారీ నీటి అవసరాలకు జనం ఇబ్బంది పడుతుంటారు. ఈ ఏడాది ముందుగా నీటి ఇబ్బందులు తలెత్తటంతో వాటర్ ట్యాంకర్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు శివారు ప్రాంతాల్లో వందలాది బోర్లు పుట్టుకొచ్చాయి. రేయింబవళ్లు వాటి నుంచి యథేచ్ఛగా నీరుతోడి నిల్వ చేస్తున్నారు. నగరంలో సుమారు 1000 జలమండలి, సుమారు 5-6వేలకు పైగా ప్రైవేటు ట్యాంకర్లు ఉన్నట్టు అంచనా. నిబంధనలకు విరుద్ధంగా కాలం చెల్లిన వాహనాలకు రంగులు వేసి నడుపుతున్నారు. పాతటైర్లు, మరమ్మతుకు నోచుకోని బండ్లు కావటంతో బ్రేక్ విఫలమై ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రాత్రిళ్లు తిరిగే చాలా ట్యాంకర్లు నంబర్ ప్లేట్ లేకుండానే తిరగటం ఆందోళన కలిగిస్తోంది. జలమండలి ఆధ్వర్యంలోని వాటర్ ట్యాంకర్ల డ్రైవర్లు కొందరు మైనర్లకు స్టీరింగ్ అప్పగించి వారు విశ్రాంతి తీసుకుంటున్నట్టు సమాచారం. ప్రైవేటు పరిస్థితి మరీ ఘోరంగా మారింది.

# తుది దశకు బైపాస్ నిర్మాణం

పెద్దపల్లి: కాజీపేట నుంచి కరీంనగర్‌కు నేరుగా వెళ్లేందుకు పెద్దపల్లి వద్ద నిర్మిస్తున్న బైపాస్ రైలు మార్గం నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఉగాది పర్వదినం కంటే ముందే పూర్తి చేసేందుకు పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నారు. ఈ నెల 25 నుంచి 28 వరకు పెద్దపల్లి, కొలనూరు నుంచి బైపాస్ మార్గంలోని క్యాబిన్‌తో ఇంటర్‌లాకింగ్ పనులతో పాటు కమీషనింగ్ పనులు పూర్తి చేయనున్నారు. బైపాస్ మార్గంలో లూప్‌లైన్(రెండో లైన్) నిర్మాణానికి కూడా టెండర్ ప్రక్రియ పూర్తయింది. ఈ పనులు కూడా ఈ నెలాఖరులోగా ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతానికి గూడ్స్ రైళ్లను మాత్రమే బైపాస్ మీదుగా మళ్లించనున్నారు. ప్రయాణికుల రైళ్లను తప్పనిసరిగా పెద్దపల్లి స్టేషన్ మీదుగానే నడుపుతారు.

**స్టేషన్‌పై తగ్గనున్న ఒత్తిడి**

బైపాస్ లైన్ నిర్మాణంతో పెద్దపల్లి ప్రధాన స్టేషన్‌పై ఒత్తిడి తగ్గనుంది. బైపాస్ మార్గంలో నిర్మించిన క్యాబిన్ ద్వారానే అక్కడి స్టేషన్ మాస్టర్ రైళ్ల నిర్వహణ బాధ్యతను నిర్వహిస్తారు. ఈ రైలు మార్గాన్ని రైల్వే శాఖ రూ.14 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టింది. 2 కిలోమీటర్ల పొడవైన ఈ రైలుమార్గం హుస్సేన్‌మియా వాగు వంతెన సమీపం నుంచి చీకురాయి రైల్వే గేటు రంగంపల్లి వద్ద ప్రస్తుత కరీంనగర్ రైలు మార్గానికి అనుసంధానమవుతుంది. ఈ మార్గం పూర్తయితే కరీంనగర్ వైపు నుంచి వెళ్లే గూడ్స్ రైళ్లు పెద్దపల్లి స్టేషన్‌కు వెళ్లకుండా నేరుగా కాజీపేట, వరంగల్ వైపు వెళ్తాయి. పెద్దపల్లి వైపు నుంచి కరీంనగర్ వెళ్లే రైళ్లకు ఎలాంటి ఇబ్బంది లేకపోయినా, కాజీపేట, వరంగల్ వైపు నుంచి వచ్చే రైళ్లు కరీంనగర్ వెళ్లాలంటే పెద్దపల్లి స్టేషన్‌లో ఇంజిన్ మార్చుకోవాల్సి వస్తుంది. దీనికే అధికంగా సమయం పట్టనుంది.

**చొరవ చూపితేనే కొత్త రైళ్లు**నిజామాబాద్ నుంచి హైదరాబాద్, ముంబయి మినహా ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే తప్పనిసరిగా సికింద్రాబాద్ మీదుగా ప్రయాణించాల్సిందే. కరీంనగర్ నుంచి తిరుపతికి మినహా మరే దూర ప్రాంతానికి రైళ్లు లేవు. రెండు జిల్లా కేంద్రాల మీదుగా ఢిల్లీ, చెన్నై లాంటి ప్రాంతాలకు కొత్త రైళ్లను ప్రవేశపెట్టేందుకు ఇద్దరు ఎంపీలు చొరవ చూపాల్సి ఉంటుంది. ఇప్పటికే ఎంపీ అరవింద్ నిజామాబాద్ నుంచి ఢిల్లీకి కొత్త రైలు కోసం ప్రతిపాదించారు. విజయవాడ, విశాఖపట్టణం, చెన్నై, బెంగళూర్ వైపు కొత్త రైళ్లను నడిపించేందుకు ఆయనతో పాటు కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చొరవ చూపాల్సి ఉంది.



# పాక్ టార్గెట్‌లో గోల్డెన్ టెంపుల్.. గీత కూడా పడనివ్వని ఆర్మీ

ఆపరేషన్ సిందూర్‌ను జీర్ణించుకోలేని పాకిస్థాన్.. మనదేశం మీదకు క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించి రెచ్చగొట్టే చర్యలకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఆపరేషన్ తర్వాత అక్కసుతో పంజాబ్‌లో అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయాన్ని లక్ష్యంగా చేసుకుందని మేజర్ జనరల్ కార్తిక్ సి శేషాద్రి వెల్లడించారు. వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టామని తెలిపారు. మన ఆపరేషన్ తర్వాత పాక్ దాడులకు పాల్పడుతుందని భారత సైన్యం అంచనా వేసింది. మిలిటరీ టార్గెట్లతో పాటు పౌరులకు చెందిన సదుపాయాలు, మతపరమైన ప్రాంతాలపై రెచ్చగొట్టే చర్యలు ఉండొచ్చని ఊహించింది. “పాక్‌కు ఎలాంటి కచ్చితమైన లక్ష్యాలు లేవని తెలుసు. గోల్డెన్ టెంపుల్‌ను లక్ష్యంగా చేసుకొనే అవకాశాలు కనిపించాయి. ముందుగానే ఊహించడంతో దానికి అదనపు రక్షణ కల్పించాం. పూర్తిగా సిద్ధమయ్యాం. మన ఆర్మీ ఎయిర్ డిఫెన్స్ గన్నర్స్.. పాకిస్థాన్ సైన్యం ప్రణాళికలను తిప్పికొట్టారు. మన స్వర్ణ దేవాలయంపై ఒక్క గీత కూడా పడకుండా అన్ని డ్రోన్లు, క్షిపణులను కూల్చివేశారు” అని మేజర్ జనరల్ వెల్లడించారు. ‘ఆపరేషన్ సిందూర్’ పేరుతో భారత సైన్యం పాక్‌లోని ఉగ్ర స్థావరాలపై విరుచుకుపడిన విషయం తెలిసిందే. ఈ మెరుపు దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులు చనిపోయారు. దాంతో వందలాదిగా పాక్ డ్రోన్స్, మిసైల్స్‌ను భారత్‌పై ప్రయోగించింది. మన ఎస్-400, ఆకాశ్ తదితర మన గగనతల రక్షణవ్యవస్థలు అద్భుతరీతిలో వాటిని నేలమట్టం చేశాయి.

వాటిని ఎక్కడికక్కడ కూల్చేశాయి. దానికి సంబంధించిన వీడియోను వెస్ట్రన్ కమాండ్ పోస్టు చేసిన సంగతి తెలిసిందే. ఇక పాక్ డ్రోన్లు, మిస్సైళ్ల శకలాలు చెల్లాచెదురుగా పడిన వీడియోలు పెద్దఎత్తున సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన సంగతి తెలిసిందే.



# నందిగం సురేశ్‌కు జూన్ 2 వరకు రిమాండ్

మంగళగిరి: వైకాపా నేత, మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు మంగళగిరి కోర్టు జూన్ 2 వరకు రిమాండ్ విధించింది. ఆయన్ను పోలీసులు గుంటూరు జిల్లా జైలుకు తరలిస్తున్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలో తెదేపా కార్యకర్త రాజుపై దాడి చేసిన కేసులో ఆదివారం ఆయన్ను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

కోర్టులో హాజరుపరచడానికి ముందు మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో నందిగం సురేశ్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, మధుమేహం స్థాయులను పరీక్షించారు. సురేశ్‌ను కోర్టులో ప్రవేశపెట్టే సమయంలో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. కోర్టు ప్రాంగణంలో ఇతరులను ఖాళీ చేయించారు. ఆయన అనుచరులు భారీగా చేరుకోవడంతో వారిని అక్కడి నుంచి వెళ్లగొట్టారు.



# భారత్ ధర్మసత్రం కాదు

## ఆశ్రయం ఇచ్చేందుకు భారత్ ధర్మసత్రం కాదు: సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

దిల్లీ: ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే శరణార్థులకు ఆశ్రయం కల్పించేందుకు భారత్ ఉచిత సత్రం కాదని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. మన దేశంలో ఆశ్రయం కోరుతూ శ్రీలంక జాతీయుడు వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది.

ఇక్కడ సెటిల్ అయ్యేందుకు మీకేం హక్కు ఉందని ధర్మాసనం ప్రశ్నించింది. అసలేం జరిగిందంటే.. నిషేధిత సంస్థ లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్‌టీటీఈ)తో సంబంధాలున్నాయని ఆరోపణలతో 2015లో శ్రీలంకకు చెందిన ఓ వ్యక్తిని తమిళనాడు పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో విచారణ జరిపిన ట్రయల్ కోర్టు.. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద 2018లో అతడిని దోషి తేలుస్తూ 10 ఏళ్ల శిక్ష ఖరారు చేసింది. అనంతరం ఆ వ్యక్తి మద్రాసు హైకోర్టును ఆశ్రయించగా.. శిక్షను ఏడేళ్లకు తగ్గిస్తూ ఉన్నత న్యాయస్థానం తీర్పు వెలువరించింది. అయితే, శిక్ష పూర్తి కాగానే దేశం విడిచి వెళ్లిపోవాలని స్పష్టం చేసింది. దీనిపై నిందితుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. తాను చట్టబద్ధమైన వీసాపైనే భారత్‌కు వచ్చానని, స్వదేశంలో తన ప్రాణాలకు ముప్పు ఉందని పేర్కొన్నాడు. అంతేగాక, తన భార్యాపిల్లలు ఈ దేశంలోనే సెటిల్ అయ్యారని తెలిపాడు. తనకు ఇక్కడే ఆశ్రయం కల్పించాలని కోరాడు. దీనికి జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్ ధర్మాసనం స్పందిస్తూ పిటిషనర్‌పై అసహనం వ్యక్తం చేసింది. “ప్రపంచం నలుమూలల నుండి వచ్చే శరణార్థులకు భారతదేశం ఆశ్రయం ఇవ్వాలా? ఇప్పటికే మా దేశంలో 140 కోట్ల మంది జనాభా ఉంది. అన్ని దేశాల నుంచి వచ్చే వారిని ఆదరించేందుకు భారత్ ధర్మశాల కాదు” అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇక్కడ సెటిల్ అయ్యేందుకు మీకేం హక్కు ఉందని ప్రశ్నించింది. దీనికి పిటిషనర్ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. శ్రీలంకలో అతడి ప్రాణాలకు ముప్పు ఉందని తెలిపారు. అలాగైతే మరో దేశానికి వెళ్లండని సుప్రీం కోర్టు సూచించింది.



# టిఫిన్ బాక్స్ లో బాంబు..! విజయనగరం ఉగ్ర కుట్రలో సంచలన నిజాలు..!



విజయనగరం, మే 19: విజయనగరం ఉగ్ర కుట్ర కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. సౌది నుంచి వచ్చే ఆదేశాలను సిరాజ్, సమీర్ అమలు చేస్తున్నట్లు దర్యాప్తు సంస్థలు, పోలీసులు గుర్తించారు. రంపచోడవరం అటవీ ప్రాంతంలో బాంబు పనితీరుపై సిరాజ్ రిహార్సల్ చేసినట్లు తేల్చారు. గత ఆరు నెలల్లో సిరాజ్ మూడు సార్లు సౌదీ వెళ్ళినట్టు పోలీసులకు వివరాలు అందాయి. టిఫిన్ బాక్స్ బాంబ్‌లు తయారు చేయాలని సిరాజ్, సమీర్‌కు సౌదీ నుంచి ఆదేశాలు వచ్చినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఆరుగురు వ్యక్తులు ఇన్స్టాగ్రామ్ గ్రూపు క్రియేట్ చేసుకున్నారని .. సిరాజ్, సమీర్‌తో పాటు టీంలో కర్ణాటక, మహారాష్ట్ర యువకులు ఉన్నట్లు తేలింది. హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు ఆరుగురు గ్యాంగ్ కలిసి ఉన్నట్లు గుర్తించారు. ఐసిస్ హ్యాండ్లర్ సౌదీ నుంచి వచ్చే ఆదేశాలు అమలు చేయడంపై మీటింగ్ పెట్టుకున్నట్లు తెలుస్తోంది. టిఫిన్ బాక్స్ బాంబులు తయారు చేయాలని ఇద్దరికీ ఆదేశాలు రాగా.. మిగతా నలుగురికి బాంబులు పెట్టే టార్గెట్లు గుర్తించాలని ఆదేశాలు వచ్చినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. హైదరాబాద్, విజయనగరంలో ఉగ్రకుట్రకు తెరలేపిన ఘటనలో ఓ వైపు ఎన్ఐఏ, మరోవైపు లా అండ్ ఆర్డర్ పోలీసులు విచారణ జరుపుతున్నారు. నిన్న ఇద్దరు వ్యక్తులను విజయనగరం పోలీసులు అరెస్ట్ చేశారు. విజయనగరానికి చెందిన సిరాజ్, సికింద్రాబాద్ బోయగూడకు చెందిన సమీర్‌లను అరెస్ట్ చేసిన తర్వాత.. వారి రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలను ప్రస్తావించారు. కొంత కాలంగా ఇన్స్టాగ్రామ్‌లో ఒక గ్రూప్‌ను ఏర్పాటు చేసి ఆరు మంది ఆ గ్రూప్‌లో ఉన్నారని, వీరికి సౌదీ అరేబియాలో ఉన్న ఐసిస్ ఉగ్రవాదులతో సంబంధాలు పెట్టుకుని వారిచ్చే ఆదేశాలతో కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. సౌదీ నుంచి వచ్చే ఆదేశాలను అమలు చేయడమే వీరి పాత్ర అని పోలీసుల విచారణలో తేలింది. విజయనగరం వెళ్లిన ఎన్ఐఏ అధికారులు.. అక్కడి పోలీసుల నుంచి కొంత సమాచారాన్ని తీసుకున్నట్లు తెలుస్తోంది. వీరిద్దనీ కస్టడీకి ఇవ్వాల్సిందిగా ఈరోజు (సోమవారం) కోర్టులో కస్టడీ పిటిషన్‌ను దాఖలు చేయనున్నారు. కస్టడీకి వచ్చిన అనంతరం హైదరాబాద్ సహా ఇతర ప్రాంతాల్లో ఎంత మందిని రిక్రూట్ చేశారు, ఐసిస్ ఉగ్రవాదులతో వీళ్లకున్న సంబంధాలు ఏంటి అనే అంశాలు విచారణలో వెల్లడి కావాల్సి ఉంది. అలాగే బాంబు పెట్టేందుకు ఎక్కడెక్కడ టార్గెట్‌లు పెట్టారు అనే అంశంపై క్లారిటీ రావాల్సి ఉంది. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన సమయంలో అమ్మోనియం నైట్రేట్, సల్ఫర్, అల్యూమినియం పౌడర్‌ను సీజ్ చేశారు. అమెజాన్‌లో టిఫిన్ బాక్సులు, వైర్లు, సెల్స్ సిరాజ్ ఆర్డర్ చేసినట్లు విచారణలో వెల్లడైంది. సిరాజ్ పలుమార్లు సౌదీకి వెళ్లి వచ్చిన నేపథ్యంలో ఇద్దరిని కస్టడీలోకి తీసుకుంటే మరికొన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు భావిస్తున్నారు. పోలీసుల విచారణ తర్వాత ఈ కేసును ఎన్ఐఏకు బదిలీ చేస్తే.. ఎన్ఐఏ పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి ఈ కుట్ర కోణాన్ని బయటపెట్టే అవకాశం ఉంది. మిగిలిన నలుగురు వ్యక్తులు ఎవరనేది క్లారిటీ రావాల్సి ఉంది.

# తిరుమల శ్రీవారికి భారీ వెండి అఖండాలు విరాళమిచ్చిన మైసూరు రాజమాత



తిరుమల: తిరుమల శ్రీవారికి మైసూరు రాజమాత ప్రమోదాదేవి రెండు భారీ వెండి అఖండాలు (అఖండ దీపాలు)ను విరాళంగా అందజేశారు. రంగనాయకుల మండపంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఆలయ అధికారులకు వాటిని అందించారు.

ఒక్కో వెండి అఖండం సుమారు 50 కిలోల బరువు ఉంటుంది. ఈ అఖండాలు శ్రీవారి గర్భగుడిలో వెలిగించే సంప్రదాయ దీపాలు. సుమారు 300 సంవత్సరాల క్రితం అప్పటి మైసూరు మహారాజు ఇలాంటి దీపాలను ఆలయానికి విరాళంగా అందించినట్లు చరిత్రలో ఉంది. శతాబ్దాల తర్వాత ఇప్పుడు మళ్లీ మైసూరు రాజమాత వాటిని సమర్పించడం విశేషం.





# ఆ నలుగురిని కస్టడీకి ఇవ్వండి.. సిట్ పిటిషన్

అమరావతి, మే 19: ఏపీ మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో కీలక నిందితులు నలుగురిని కస్టడీకి ఇవ్వాలని విజయవాడ కోర్టులో సిట్ పిటిషన్ దాఖలు చేసింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణ మోహన్ రెడ్డి, ఈ కేసులో ఏ1గా ఉన్న కశిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్‌గా ఉన్న బాలాజీ గోవిందప్పలను వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు కోరారు. వీరు నలుగురిని కలిపి విచారించాల్సిన అవసరం ఉందని సిట్ బృందం పేర్కొంది. మద్యం ముడుపులు, కమిషన్ వ్యవహారంలో ఈ నలుగురికి తెలిసి కొన్ని విషయాలు జరిగాయని.. అందువల్లే నలుగురిని కలిపి విచారించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. అప్పుడు మాత్రమే ఈ కేసు తదనంతర దర్యాప్తుకు అవకాశం ఉంటుందని తెలిపింది. సిట్ పిటిషన్‌పై రేపు (మంగళవారం) విచారణ జరిగే అవకాశం ఉంది. మరోవైపు రాజ్‌కసిరెడ్డి వాంగ్మూలం రికార్డు చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విజయవాడ కోర్టులో మూడు రోజుల క్రితం పిటిషన్ వేసింది. ఈ పిటిషన్‌పై ఈరోజు ఏసీబీ కోర్టు విచారణకు రాగా.. కసిరెడ్డి వాంగ్మూలం రికార్డు చేసేందుకు తమకు అనుమతి ఇవ్వాలని ఈడీ తరఫు న్యాయవాదులు కోరారు. విచారణను ఏసీబీ కోర్టు రేపటికి (మంగళవారం) వాయిదా వేసింది. ఇదే సమయంలో నలుగురు కీలక నిందితుల కస్టడీ పిటిషన్‌పై కోర్టు రేపు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే ఆసక్తికరంగా మారింది. మరోవైపు లిక్కర్ స్కాం కేసులో ఏ33గా ఉన్న గోవిందప్పను వారం రోజుల పాటు కస్టడీకి కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ కస్టడీ పిటిషన్‌పై ఏసీబీ కోర్టులో వాదనలు ముగిశాయి. తీర్పును న్యాయస్థానం రిజర్వ్ చేసింది. అలాగే లిక్కర్ కేసులో ఏ30 పైలా దిలీప్ బెయిల్ పిటిషన్‌పై సిట్ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. దిలీప్‌కు బెయిల్ మంజూరు చేస్తే విచారణకు విఘాతం కలుగుతుందంటూ పేర్కొన్నారు. ఈ కేసులో దిలీప్ ద్వారా కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి మొత్తం వ్యవహారం నడిపించారని సిట్ అధికారులు తెలిపారు. పైలా దిలీప్ బెయిల్ పిటిషన్‌పై రేపు కోర్టులో విచారణ జరుగనుంది. ఇక ఈ కేసులో ఏ6గా ఉన్న సజ్జల శ్రీధర్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ రేపటికి వాయిదా పడింది. ఈ పిటిషన్‌పై ఏసీబీ కోర్టు రేపు విచారించనుంది.

# డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదా.. లోకేశ సీరియస్



విశాఖపట్నం, మే 19: గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)లో తమకు కావాల్సినంత సంఖ్య బలం ఉందని ఏపీ టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. జీవీఎంసీలో డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదా పడింది. ఈ నేపథ్యంలో సోమవారం విశాఖపట్నంలో పల్లా శ్రీనివాస రావు మాట్లాడుతూ.. నిన్నటి వరకు.. డిప్యూటీ మేయర్ అభ్యర్థి ఎంపిక విషయంలో నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యం కావడానికి ఒక కారణం ఉందన్నారు. గత రాత్రి 11.00 గంటలకు ఆ పదవి జనసేన పార్టీకి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు. అయితే ఆ పదవి కోసం టీడీపీలో ఆశావాహులున్న మాట వాస్తవమని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఇక ఈ ఎన్నిక వాయిదా పడడానికి కోఆర్డినేషన్ సమస్య కూడా ఒక కారణమన్నారు. అందుకే ఈ ఇబ్బంది వచ్చిందని ఆయన తెలిపారు. జీవీఎంసీ కౌన్సిల్‌కు సభ్యులంతా వస్తారని తాము ధీమాతో ఉన్నామన్నారు. దీనికి తాను పూర్తి బాధ్యత వహిస్తానని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. మరోవైపు.. విశాఖపట్నంలో నేడు జరగాల్సిన డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదా పడడం.. అందుకు పార్టీ కార్పొరేటర్లు గైర్హాజరు కారణం కావడంపై తెలుగుదేశం పార్టీ అధిష్టానం సీరియస్ అయింది. ఈ ఎన్నికకు గైర్హాజరైన వారికి నోటీసులు జారీ చేయాలని రాష్ట్ర నాయకత్వానికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆదేశించారు. కొందరిపై చర్యలకు వెనకాడ వద్దని ఈ సందర్భంగా రాష్ట్ర నాయకత్వానికి ఆయన కీలక సూచన చేశారు. మరోసారి ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

విశాఖపట్నం డిప్యూటీ మేయర్ ఎన్నిక ఈ రోజు జరగాల్సి ఉంది. కానీ కౌన్సిల్‌లో సభ్యులు మొత్తం 74 మంది ఉంటే.. 54 మంది మాత్రమే హాజరయ్యారు. ఈ డిప్యూటీ మేయర్ ఎన్నికకు 56 మంది సభ్యులు అవసరమవుతారు. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికను మంగళవారం నిర్వహించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇంకోవైపు ఈ డిప్యూటీ మేయర్ ఎన్నికకు కౌన్సిల్ సభ్యులంతా హాజరు కావాలని ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి.

# విశాఖ స్టీల్‌లో ప్రమాదం.. 300 టన్నుల ద్రవ ఉక్కు నేలపాలు





విశాఖపట్నం: విశాఖపట్నం ఉక్కు కర్మాగారంలో ప్రమాదం చోటుచేసుకుంది. ఫలితంగా బ్లాస్ట్‌ఫర్నేస్-2లో సుమారు 300 టన్నుల ద్రవ ఉక్కు నేలపాలైంది. ఫర్నేస్ నుంచి టర్బో ల్యాడిల్ కార్‌లోకి (టీఎల్‌సీ) ద్రవ ఉక్కును నింపి, ఎస్ఎంఎస్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇంతలో ఒక్కసారిగా టీఎల్‌సీకి రంధ్రం పడి ద్రవ ఉక్కు కిందపడిపోయింది. ఈ ఘటనలో కేబుల్స్ కాలిపోయి, ట్రాక్ దెబ్బతింది. ఎలాంటి ప్రాణనష్టం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే అధికారులు, అగ్నిమాపక సిబ్బంది మంటల్ని అదుపు చేసి ట్రాక్ మీద పడిన ఉక్కును, ల్యాడిల్ కార్‌ను తొలగించే పనులు చేపట్టారు. కాగా.. టీఎల్‌సీకి ఇటీవలే రిఫ్రాక్టరీ లైనింగ్ వేసి సిద్ధం చేశారు.

అది సుమారు 1,050 హీట్ల వరకు పని చేయాల్సి ఉండగా, 500 హీట్లకే రంధ్రం పడిపోవడంతో లైనింగ్ పనుల్లో నాణ్యత కొరవడిందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, నిపుణులైన సిబ్బందితో పనులు చేయించాలని స్టీల్ ఇంటక్ అధ్యక్షుడు పి.వి.రమణమూర్తి, సీటూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి డిమాండ్ చేశారు.

# తెలుగు రాష్ట్రాల్లో వేర్వేరు రోడ్డు ప్రమాదాలు.. ఐదుగురి దుర్మరణం

డోన్ , తాడ్వాయి: తెలుగు రాష్ట్రాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. నంద్యాల జిల్లాలో జరిగిన ఘటనలో ముగ్గురు.. తెలంగాణలోని ములుగు జిల్లాలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు.

ఈ ప్రమాదాల్లో మొత్తం 18 మందికి గాయాలయ్యాయి. ఏపీలోని నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పోదొడ్డి వద్ద కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా.. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. మృతులను కర్ణాటకలోని తుమకూరుకు చెందిన సంతోష్(47), లోకేశ్ (37), నవీన్ (37)గా పోలీసులు గుర్తించారు. శ్రీశైలం, మహానంది ఆలయాలను దర్శించుకుని డోన్ మీదుగా తిరిగి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. తెలంగాణలోని ములుగు జిల్లా తాడ్వాయిలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఇసుక లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు మహిళలు మృతిచెందగా.. 15 మందికి గాయాలయ్యాయి. మృతులను చెట్టుపెల్లి శ్వేత (40), నూగ దుర్గ (38)గా గుర్తించారు. ట్రాక్టర్ మేడారం వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను ములుగు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## చార్మీ.. చాలా రోజుల తరువాత ఇలా..

టాలీవుడ్‌లో ఒకప్పుడు గ్లామరస్ హీరోయిన్‌గా వెలుగొందిన చార్మీ కౌర్, చాలా రోజుల తర్వాత తన ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. తన 38వ పుట్టినరోజు సందర్భంగా ఆమె ఈ ఫోటోను అప్‌లోడ్ చేసింది. చార్మీ ఈ ఫోటోలో ఎప్పటిలాగే అందంగా, ఎనర్జిటిక్‌గా కనిపించింది, ఆమె స్టైల్ అందరినీ ఆకర్షించింది. ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, అభిమానుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. అనుకోకుండా ఒక రోజు', 'లక్ష్మి' సినిమాలతో ఒకప్పుడు హీరోయిన్‌గా టాలీవుడ్‌లో స్టార్‌డమ్ సంపాదించిన చార్మీ, 2015 తర్వాత నటనకు దూరమైంది. ఆమె నిర్మాతగా మారి, పూరి జగన్నాథ్‌తో కలిసి పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పలు సినిమాలను నిర్మించింది. నిర్మాతగా ఆమె విజయవంతమైన ప్రయాణం సాగుతున్నప్పటికీ, ఆమె నటనను మిస్ అవుతున్నామని అభిమానులు అంటున్నారు. చార్మీ చివరిసారిగా 2015లో 'మంత్ర 2' సినిమాతో నటిగా కనిపించింది. ఆ తర్వాత నటనకు పూర్తిగా



దూరమై, నిర్మాణంపై దృష్టి సారించింది. అయితే, ఆమెకు ఇప్పటికీ నటనకు సంబంధించిన అవకాశాలు వస్తున్నాయని, కానీ ఆమె వాటిని సున్నితంగా తిరస్కరిస్తోందని సమాచారం. నిర్మాతగా ఆమె బిజీ షెడ్యూల్, కొత్త కథలపై ఫోకస్ ఆమెను నటనకు దూరంగా ఉంచుతున్నాయని టాక్. ఈ సందర్భంగా చార్మీ పుట్టినరోజు ఫోటో అభిమానులకు సర్‌ప్రైజ్‌గా నిలిచింది. ఆమె ఈ ఫోటోలో బ్లాక్ అండ్ వైట్ డ్రెస్‌లో అద్భుతంగా కనిపించింది, ఆమె అందం, స్టైల్ అందరినీ ఆకట్టుకుంది. "చార్మీ ఎప్పటిలాగే అద్భుతంగా ఉంది, మళ్లీ నటించాలని కోరుకుంటున్నాం" అని అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. ఈ ఫోటో ఆమె పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు ఓ చిన్న ట్రీట్‌గా నిలిచింది. చార్మీ నిర్మాతగా తన దృష్టిని కొనసాగిస్తున్నప్పటికీ, ఆమె నటనకు తిరిగి రావాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఆమె ఎనర్జిటిక్ పర్ఫామెన్స్‌లు, స్క్రీన్ ప్రెజెన్స్ ఇప్పటికీ అభిమానుల మదిలో నిలిచి ఉన్నాయి. ఆమె త్వరలో నటనలోకి రీఎంట్రీ ఇస్తుందా అనేది ఆసక్తికరంగా మారింది. ఇక నెక్స్ట్ నిర్మాతగా ఆమె విజయ్ సేతుపతి పూరి కాంబినేషన్ కోసం సిద్ధం అవుతున్నారు.

## బిడ్డొచ్చే వేళ స్టార్ హీరోకి కలిసొచ్చేనా?

కియరా అద్వానీ లాంటి ట్యాలెంటెడ్ నటిని ప్రేమించి పెళ్లాడాడు సిద్ధార్థ్ మల్హోత్రా. అయితే పెళ్లి తర్వాత ఎందుకనో సిద్ధార్థ్ కి సరైన హిట్టు పడలేదు. ఇటీవలే కియరా ప్రెగ్నెన్సీని కన్ఫామ్ చేసింది. అయితే ఇకపై అతడి కెరీర్ గ్రాఫ్ లో ఛేంజ్ అనూహ్యంగా ఉంటుందని అభిమానులు ఊహిస్తున్నారు. తన భార్య తనకు బిడ్డను ఇచ్చే లోపే అతడు మరో బంపర్ హిట్టు కొట్టాలని కసితో ఉన్నాడట. తదుపరి మల్హోత్రా ప్రయోగాత్మక చిత్రంలో నటించనున్నాడు. కోటా ఫ్యాక్టరీ, పంచాయత్ వంటి ఐకానిక్ సిరీస్‌లను కొనుగోలు చేసిన టివిఎఫ్ స్టూడియో ఇప్పుడు సిద్ధార్థ్ మల్హోత్రా ప్రధాన పాత్రలో వ్వాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్



అనే జానపద థ్రిల్లర్‌ను తెరకెక్కించనుంది. దీనికి దీపక్ మిశ్రా దర్శకుడు. అద్భుత కథల ఎంపికలతో టివిఎఫ్ ఇప్పటికే అందరి దృష్టిని ఆకర్షించింది. కోటా ఫ్యాక్టరీ, పంచాయత్ లాంటి వైవిధ్యమైన సిరీస్ లతో ప్రజల దృష్టిని ఆకర్షించిన టీవీఎఫ్ మరో వైవిధ్యమైన స్క్రిప్టుతో విజయం కోసం ఎదురు చూస్తున్న సిద్ధార్థ్ లోటును భర్తీ చేస్తుందని భావిస్తున్నారు. టీవీఎఫ్ తో పాటు ఏక్తా కపూర్ బాలాజీ టెలీఫిలింస్ ఇందులో పెట్టుడులు పెడుతుంది. సిద్ కి షేర్షా తర్వాత సరైన హిట్ లేదు. థాంక్ గాడ్, యోధ కూడా ఆశించిన విజయాలను సాధించలేదు. కానీ ఇప్పుడు బిడ్డొచ్చే వేళ మంచి హిట్టొస్తుందని ఆశిస్తున్నాడు. అది వ్వాన్ తో సాధ్యమవుతుందని అభిమానులు భావిస్తున్నారు. జాన్వీతో పరమ్ సుందరి కూడా సిద్ధార్థ్ కి విజయాన్ని అందించాల్సి ఉంటుంది.





## యాక్షన్ లో కమల్-సింబు రణం!




కమల్ హాసన్, మణిరత్నం కాంబినేషన్ అంటే ఎప్పుడూ ఓ ప్రత్యేక ఆకర్షణ ఉంటుంది. దశాబ్దాల తర్వాత వీరిద్దరూ మళ్లీ కలిసి 'థగ్ లైఫ్' సినిమాతో రాబోతున్నారు, ఈ చిత్రం జూన్ 5న విడుదల కానుంది. రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జైంట్ మూవీస్ సంయుక్త నిర్మాణంలో రూపొందిన ఈ సినిమా ట్రైలర్ విడుదలై, అభిమానులను ఆకర్షించింది. ఈ ట్రైలర్ యాక్షన్, ఎమోషన్, డ్రామాతో మణిరత్నం మార్క్ కు తగ్గట్లే ఉంది. ట్రైలర్‌లో గ్యాంగ్‌స్టర్ రాజకీయాలు, వ్యక్తిగత పునరాగమనం నేపథ్యంలో కమల్ హాసన్, సింబు మధ్య బలమైన బంధాన్ని చూపించారు. కమల్ హాసన్ ఒక సీనియర్ గ్యాంగ్‌స్టర్‌గా, సింబు ఆయన శిష్యుడిగా కనిపిస్తారు. గురు-శిష్యుల సంబంధంగా మొదలైన ఈ బంధం, క్రమంగా ఒక డెడ్లీ రైవలరీగా మారుతుంది. కమల్ హాసన్ తన లెగసీ, ప్రతీకారం మధ్య సంఘర్షణలో మాగ్నెటిక్‌గా కనిపిస్తే, సింబు తన గురువును సవాలు చేసే యువకుడిగా ఇంటెన్స్ ఎమోషన్స్‌తో ఆకట్టుకున్నాడు. మణిరత్నం సిగ్నేచర్ స్టైల్ ఈ ట్రైలర్‌లో స్పష్టంగా కనిపిస్తుంది. ఎలిగెంట్ అయినప్పటికీ రా ఎమోషన్స్‌తో నిండి ఉంది. ఏఆర్ రహమాన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ యాక్షన్‌కు, ఎమోషన్స్‌కు ఊపిరిలా మారింది. రవి కె. చంద్రన్ సినిమాటోగ్రఫీ అద్భుతమైన ఫ్రేమ్‌లతో కథలోని గ్రాండ్‌నెస్, గ్రిట్‌ను అద్భుతంగా బంధించింది. ట్రైలర్‌లోని ప్రతి షాట్ సినిమాటిక్ బ్యూటీని, ఎమోషనల్ డెప్త్‌ను చూపిస్తోందని అభిమానులు అంటున్నారు. ట్రైలర్‌లో కమల్ హాసన్ ఒక గ్యాంగ్‌స్టర్‌గా తన సామ్రాజ్యాన్ని కాపాడుకునే క్రమంలో చూపించిన ఇంటెన్సిటీ అద్భుతంగా ఉంది. సింబు క్యారెక్టర్ ఎదుగుదల, గురువుతో సంఘర్షణ సన్నివేశాలు హైలైట్‌గా నిలిచాయి. త్రిష, జోజు జార్జ్, అలీ ఫజల్, పంకజ్ త్రిపాఠి వంటి నటులు కూడా ట్రైలర్‌లో కనిపించి, సినిమాపై అంచనాలను పెంచారు. ఈ సినిమా భారీ స్క్రీన్‌పై చూడాల్సిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని టాక్ నడుస్తోంది. సినిమా రిలీజ్‌కు రెండు వారాల ముందు ఈ ట్రైలర్‌తో ప్రమోషన్స్ జోరందుకున్నాయి. ట్రైలర్‌లోని యాక్షన్ సీక్వెన్స్‌లు, ఎమోషనల్ మూమెంట్స్ అభిమానులను థియేటర్‌లో ఓ ఫైరీ షోడౌన్‌ను ఆశించేలా చేశాయి. మణిరత్నం స్టైలిష్ డైరెక్షన్, కమల్-సింబు కెమిస్ట్రీ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. మొత్తంగా, 'థగ్ లైఫ్' ట్రైలర్ సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది. ఇక జూన్ 5న ఈ సినిమా ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.

## వారికి చుక్కలు చూపిస్తున్న డిజిటల్ ప్లాట్‌ఫామ్స్!



కరోనా మహమ్మారి కారణంగా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లకు మంచి క్రేజ్ ఏర్పడింది. నచ్చిన సినిమాలు, సిరీస్‌లు థియేటర్‌కు వెళ్లకుండా ఇంట్లోనే ఉండి చూసే ఫెసిలిటీ ఉండటంతో చాలా వరకు ప్రేక్షకులు ఓటీటీలకు ఎడిక్ట్ కావడం మొదలైంది. దీంతో సినిమాలు, సిరీస్‌లని భారీ స్థాయిలో కొనడం ప్రారంభించిన ఓటీటీ ప్లాట్ ఫామ్‌లు వాటి ప్రవాహం భారీగా పెరగడంతో క్రమ క్రమంగా సినిమాలు, సిరీస్‌లని కొనడం తగ్గించి మేకర్స్‌కు షాక్ ఇవ్వడం మొదలు పెట్టాయి. కేవలం స్టార్ హీరోలు, స్టార్ ప్రొడక్షన్ కంపనీలు నిర్మించిన సిరీస్‌లు, సినిమాలకు మాత్రమే ప్రాధాన్యతనిస్తూ కొత్త మేకర్స్‌ని పక్కన పెడుతుండటంతో చాలా వరకు మేకర్స్ తీవ్ర ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారు. అంతకు ముందు డిజిటల్ రైట్స్ కోసం భారీ మొత్తాన్ని అందించి చాలా వరకు నిర్మాతలకు లాభాల్ని అందించి సిరీస్‌లు, ఓటీటీ మూవీస్‌కు ఊతం ఇచ్చిన ఓటీటీలు ఇప్పుడు కేవలం సెలక్టీవ్‌గా సినిమాలు, సిరీస్‌లని మాత్రమే కొంటూ మిగతావారికి చుక్కలు చూపిస్తు న్నాయి. తక్కువ బడ్జెట్‌లో ఓ మోస్తారు పేరున్న నటీనటులతో నిర్మించిన వాటికి పెద్దగా ఇంపార్టెన్స్ ఇవ్వడం లేదు. దీంతో చిన్న సినిమాలు, సిరీస్‌లు నిర్మిస్తున్న మేకర్స్ ఇబ్బందులకు గురవుతున్నారు. అంతే కాకుండా ఈ మధ్య డిజిటల్ ప్లాట్ పామ్స్ కొత్త పద్ధతిని కూడా అనుసరిస్తున్నాయి. చాలా మంది సినిమాలు తీసివాటిని థియేటర్లలో రిలీజ్ చేసుకునే వీలు, డబ్బులు లేకపోవడంతో ఓటీటీలని ఆశ్రయిస్తున్నారు. అలా తీసుకొచ్చిన సినిమాలని పే పర్ వ్యూ పద్ధతిలో తీసుకుంటూ కొత్త తరహాలో ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు మేకర్స్ వాపోతున్నారు. చిన్న బడ్జెట్ సినిమాల నిర్మాతలకు తమ చిత్రాలని థియేటర్లలో రిలీజ్ చేయడానికి సరిపడా డబ్బులు ఉండటం లేదు. అంతే కాకుండా పబ్లిసిటీకి బడ్జెట్ కేటాయించలేకపోతున్నారు. దీంతో ఓటీటీలు కూడా ఈ సినిమాలని తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. దీంతో దాదాపు 300 సినిమాలు ప్రస్తుతం రిలీజ్‌కు నోచుకోక పీకల్లోతు కష్టాల్ని ఎదుర్కొంటున్నాయని ఇన్ సైడ్ టాక్. శాటిలైట్ మార్కెట్ కూడా వీరికి డోర్లు క్లోజ్ చేయడంతో చిన్న సినిమాలు నిర్మించిన నిర్మాతలంతా ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారట. ఇది ఇప్పుడు టాలీవుడ్‌లో ప్రధాన సమస్యగా మారిందని ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## థై స్లిట్ లెహంగాలో మీనాక్షి కిల్లర్ ఫోజ్

అందానికి అందం ప్రతిభ రెండూ ఉంటే స్కై ఈజ్ లిమిట్ అన్న చందంగా ఎదిగేందుకు ఛాన్సుంది. గ్లామ్ అండ్ గ్లిజ్ ప్రపంచంలో నేటితరం నటీమణులు దూసుకెళుతున్నారు. మునుపటితో పోలిస్తే పెద్దతెర, ఓటీటీ తెరపై ప్రయోగాత్మక కథలు తెరకెక్కుతున్నాయి. దానికి తగ్గట్టే నటీమణులకు కూడా నటించేందుకు స్కోప్ పెరిగింది. ఆ కోవలో చూస్తే నేటితరం హీరోయిన్ మీనాక్షి చౌదరి తదుపరి నటనకు ఆస్కారం ఉన్న పాత్రలలో అవకాశం అందుకుంటోంది. ఈ సంవత్సరం ప్రారంభంలో మీనాక్షి చౌదరి సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ సాధించింది. ఆ తర్వాత వరుస సినిమాలతో బిజీ అయిపోయింది. మీనాక్షి తదుపరి అనగనగ ఒక రాజులో నవీన్ పోలిశెట్టితో కలిసి కనిపించనుంది. తాజా కథనాల ప్రకారం, మీనాక్షి




బాలీవుడ్‌లోకి అడుగుపెట్టడానికి సిద్ధమవుతోంది. స్త్రీ 2 నిర్మాత దినేష్ విజన్ సినిమాలో కీలక పాత్రను పోషించే అవకాశం ఉందని కథనాలొచ్చాయి. మాడాక్ ఫిల్మ్స్ మీనాక్షి కోసం ఒక స్క్రిప్ట్‌ను సిద్ధం చేస్తోంది. ఇందులో హీరో ఎవరో ఇంకా వెల్లడించాల్సి ఉంది. మరోవైపు మీనాక్షి సోషల్ మీడియాల్లో తన ఫాలోవర్స్ ని నిరాశపరచడం లేదు. వరుసగా క్రేజీ మ్యాగజైన్ కవర్ షూట్లతోను మీనాక్షి అభిమానులను అలరిస్తోంది. తాజాగా ఫేస్ మ్యాగజైన్ కవర్ పేజీ కోసం అద్భుతమైన ట్రెడిషనల్ లెహంగాలో దర్శనమిచ్చింది. అయితే ఇది చూడటానికి సాంప్రదాయబద్ధంగా కనిపించినా థై స్లిట్ ఎలివేషన్ తో మోడ్రన్ టచ్ ని మీనాక్షి చూపించింది. డిజైనర్ బ్లౌజ్, ఇన్నర్ అందాలను తాకుతూ దుపట్టా, బాటమ్ లో థై స్లిట్ ఎలివేషన్ ప్రతిదీ దేనికదే ప్రత్యేకం. ది ఆర్ట్ ఆఫ్ బికమింగ్: మీనాక్షి రీన్ ఆఫ్ రీఇన్వెన్షన్ పేరుతో సరికొత్త కవర్ స్టార్‌గా మీనాక్షిని ఫేస్ మ్యాగజైన్ ప్రెజెంట్ చేస్తోంది. నేటి జెన్ జెడ్ హీరోయిన్ మీనాక్షి కొత్త లుక్ ఇప్పుడు ఇంటర్నెట్ లో వైరల్ గా దూసుకెళుతోంది.

## ఫైనల్‌గా శ్రీవిష్ణు తనకు లక్కీ ఛార్మ్ అయ్యాడుగా!

సినీ ఇండస్ట్రీలో ఎప్పుడు ఎవరి కెరీర్ ఎలాంటి మలుపు తీసుకుంటుందో ఎవరూ చెప్పలేరు. రాత్రికి రాత్రే బ్లాక్ బస్టర్లని దక్కించుకుని స్టార్‌డమ్‌ని సొంతం చేసుకున్న వాళ్లున్నారు. ఎన్నేళ్లైనా ఒక్క హిట్ దక్కని వారూ ఉన్నారు. కొంత మంది రెండు మూడు సినిమాల తరువాత సక్సెస్ బాటపడితే కొంత మంది మాత్రం ఆ సక్సెస్ కోసం వేచి చూడాల్సిన పరిస్థితి. గత కొన్నేళ్లుగా ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంది హాట్ లేడీ కేతిక. తను కెరీర్ ప్రారంభించి నాలుగేళ్లవుతోంది. పూరి జగన్నాథ్ తనయుడు ఆకాష్ పూరి హీరోగా నటించిన రొమాంటిక్ మూవీతో హీరోయిన్‌గా కెరీర్ ప్రారంభించిన ఈ ఢిల్లీ సోయగం అంతకు ముందు డబ్‌స్మాష్ వీడియోలతో పాపులర్ అయింది. అదే పాపులారిటీ కారణంగా పూరి దృష్టిలో పడిన కేతిక రొమాంటిక్ మూవీతో నటించే అవకాశాన్ని దక్కించుకుంది. హీరోయిన్‌గా తనకిదే తొలి సినిమా. ఇది తనకు ఆశించిన విజయాన్ని



అందించలేకపోయింది. కావాల్సిన గ్లామర్ ఉన్నా, ఎక్స్ పోజింగ్‌కు ఎలాంటి అభ్యంతరం చెప్పలేకపోయినా కానీ తనని విజయం వరించలేదు. ఆతరువాత చేసిన లక్ష్య, రంగరంగ వూఐభవంగ, బ్రో వంటి సినిమాలు కేతికకు విజయాన్ని అందించలేకపోయాయి. కెరీర్ ప్రారంభించి నాలుగేళ్లు కావస్తున్నా కేతికకు సక్సెస్ అందని ద్రాక్షగా మారి దోబూచులాడుతోంది. సక్సెస్ కోసం నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్న కేతిక కల హీరో శ్రీవిష్ణు కారణంగా తాజాగా నెరవేరింది. శ్రీవిష్ణుతో కలిసి కేతిక నటించిన లేటెస్ట్ మూవీ సింగిల్. మే 9న విడుదలైన ఈ సినిమా ఫస్ట్ డే ఫస్ట్ షో నుంచే సూపర్ హిట్ టాక్‌ని సొంతం చేసుకుంది. ఇప్పటి వరకు ఈ సినిమా రూ. 15 కోట్లు రాబట్టి బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. కెరీర్ ఇక కష్టమేనా అనుకున్న సమయంలో కేతికకు హిట్ ఇచ్చిన శ్రీవిష్ణు ఆమె కెరీర్‌కు ప్లస్ అయ్యాడు. ఆమె పాలిట లక్కీ ఛార్మ్‌గా మారాడు.

దీంతో కేతిక కెరీర్ కొత్త మలుపు తిరిగింది. ఈ సినిమా తరువాత కేతిక క్రేజ్ పెరుగుతుందని, వరుసగా క్రేజీ ప్రాజెక్టులు తనని వరిస్తాయని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. అన్నట్టుగా కేతిక సింగిల్ తరువాత తమిళ దర్శకుడు రాజేష్ ఎం. సెల్వ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తోంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమా త్వరలోనే తమిళ, తెలుగు భాషల్లో రిలీజ్ కాబోతోంది.



# నల్లమల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

అమ్రాబాద్: నల్లమల ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రచిస్తామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పోడు భూములను వ్యవసాయానికి అనుకూలంగా మారుస్తున్నామని చెప్పారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారంలో 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకాన్ని సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా 'నల్లమల డిక్లరేషన్'ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు.

నల్లమల డిక్లరేషన్ ద్వారా గిరిజనుల సంక్షేమానికి రూ.12,600 కోట్లతో పనులు చేపడతామని తెలిపారు. "ఒకప్పుడు నల్లమల అంటే వెనుకబడిన ప్రాంతం. ఎవరో ఒక నాయకుడు వచ్చి అభివృద్ధి చేయాలని అనేవారు. సీఎంగా ఇక్కడి నుంచి మాట్లాడుతుంటే నా గుండె ఉప్పొంగిపోతోంది. పాలమూరు, నల్లమల ప్రాంత వాసినని గర్వంగా చెప్పుకొంటా. కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ఈ ప్రాంతం రుణం తీర్చుకుంటున్నా. దేశంలో ఎక్కడ ప్రాజెక్టులు కట్టాలన్నా పాలమూరు వాసులను పిలిచేవారు.

ఇక్కడి ప్రజలు కట్టిన ప్రాజెక్టులు నేడు దేశానికి వెన్నెముకగా నిలిచాయి. ఇక్కడి రైతులందరికీ ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఇస్తాం. వందరోజుల్లో సోలార్ విద్యుత్ మోటార్ అందిస్తాం. అచ్చంపేట నియోజకవర్గాన్ని ప్రపంచానికే ఆదర్శంగా మారుస్తాం. దిగ్గజ కంపెనీలతో పోటీపడేలా శిల్పారామం దగ్గర మహిళలకు స్టాళ్లు ఏర్పాటు చేశాం. సన్నబియ్యం లబ్ధిదారుల ఇంటికి స్వయంగా వెళ్లి భోజనం చేసి వచ్చాను. నేడు ప్రతి పేదవాడి ఇంటికీ సన్న బియ్యం అందుతోంది. ఇప్పటి వరకు రైతుల కోసం రూ.60వేల కోట్లు ఖర్చు చేశాం.

**ప్రధాని అంటే ఇందిరలా ఉండాలనే చర్చ వచ్చింది..** పహల్గాం ఘటన తర్వాత ప్రధాని అంటే ఇందిరాగాంధీలా ఉండాలనే చర్చ వచ్చింది. ఆమె గతంలో పాకిస్థాన్‌తో యుద్ధం చేసి ఆ దేశాన్ని రెండు ముక్కలు చేశారు. 50 ఏళ్ల తర్వాత ఇందిరాగాంధీ పేరు చెప్పుకొంటున్నాం. దేశానికి స్వేచ్ఛనిచ్చిందే కాంగ్రెస్. అందరికీ భూములు ఇచ్చి ఆత్మగౌరవం నింపాలన్నది మా పార్టీ నినాదం. ప్రతి ఆదివాసీ గుండెల్లో ఇందిరమ్మ ఉంటుంది" అని రేవంత్ అన్నారు.

**ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు...** అనంతరం సతీమణితో సహా సీఎం రేవంత్‌రెడ్డి కొండారెడ్డిపల్లె శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లారు. అక్కడ సీఎం దంపతులు, మంత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సభాపతి గడ్డం ప్రసాద్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేని శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, సీతక్క తదితరులు పాల్గొన్నారు.



# సుప్రీంలో టెల్కోలకు షాక్..

## సుప్రీంలో టెల్కోలకు షాక్.. వొడాఫోన్ ఐడియా షేర్లు డౌన్

టెలికాం సంస్థలకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. సర్దుబాటు చేసిన స్థూల రాబడి బకాయిల నుంచి ఊరట కల్పించాలంటూ టెలికాం కంపెనీలు దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. దీంతో వొడాఫోన్ ఐడియా షేర్లు కుప్పకూలాయి. సోమవారం ఇంట్రాడేలో వీఐ షేర్లు 10 శాతం క్షీణించాయి. మధ్యాహ్నం 1:50గంటల సమయంలో ఎన్ఎస్ఈలో షేర్లు 8.28 శాతం నష్టంతో కదలాడుతున్నాయి. ఏజీఆర్ బకాయిలపై వడ్డీ, పెనాల్టీలు, పెనాల్టీలపై వడ్డీ నుంచి తమకు మినహాయింపు కల్పించాలని టెలికాం సంస్థలు వొడాఫోన్ ఐడియా, భారతీ ఎయిర్‌టెల్, టాటా టెలీ సర్వీసెస్ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం పిటీషన్‌ను కొట్టివేసింది. ఈ నిర్ణయంతో టెలికాం సంస్థలపై భారం పడనుందన్న భయంతో షేర్లు ఒత్తిడికి గురవుతున్నాయి. వీఐ షేర్లు నష్టాల్లో ట్రేడవుతుండగా.. భారతీ ఎయిర్‌టెల్ షేర్లు ఫ్లాట్‌గా కదలాడుతున్నాయి.



# ఉగ్రదాడికి ముందు పహల్గాంకు వెళ్లిన జ్యోతి

## ఉగ్రదాడికి ముందు పహల్గాంకు.. జ్యోతి మల్హోత్రా కేసులో విస్తుపోయే విషయాలు

పాకిస్థాన్‌కు గూఢచర్యం చేస్తూ అరెస్టయిన హరియాణా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా కేసు విచారణలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పహల్గాంలో ఉగ్రదాడి జరగడానికి కొన్ని నెలల ముందు ఆమె ఆ ప్రాంతానికి వెళ్లినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇక, పాకిస్థాన్ ఐఎస్ఐతో సంబంధాలున్న ఆ దేశ హైకమిషన్ ఉద్యోగి డానిష్‌తో జ్యోతికి సన్నిహిత సంబంధాలున్నట్లు తెలిసింది. ఏప్రిల్ 22న పహల్గాంలో పర్యాటకులపై భీకర ఉగ్రదాడి జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు మూడు నెలల ముందు జ్యోతి పహల్గాం వెళ్లి అక్కడ వీడియోలు తీసినట్లు సమాచారం. ఆ సమాచారాన్ని పాక్ ఏజెంట్లకు చేరవేసి ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు. దీనిపై పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. గూఢచర్యం ఆరోపణల కింద గతవారం జ్యోతిని హరియాణా పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పటికే ఆమె గురించి అనేక విషయాలు బయటికొచ్చాయి. పహల్గాం దాడికి ముందు ఆమె పలుమార్లు పాకిస్థాన్‌లో పర్యటించిందని, ఒకసారి చైనాకూ వెళ్లొచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. 'ఆపరేషన్ సిందూర్' అనంతరం నెలకొన్న ఉద్రిక్తతల సమయంలో ఆమె దిల్లీలోని పాక్ రాయబార కార్యాలయంలోని అధికారి డానిష్‌తో టచ్‌లో ఉన్నట్లు నిర్ధరించారు. జ్యోతిని అతడు ట్రాప్ చేసినట్లు గుర్తించారు. ట్రావెల్ బ్లాగర్, యూట్యూబర్ అయిన జ్యోతి మల్హోత్రా ట్రావెల్ విత్ జో (%ఙతీఖజవశ్రీ ఔఙ్త్ష జీశీ%) పేరుతో ఓ యూట్యూబ్ ఛానెల్ నిర్వహిస్తోంది. 2023లో పాక్‌కు వెళ్లిన సమయంలో డానిష్ ఆమెకు పరిచయమయ్యాడు. భారత్‌కు వచ్చిన తర్వాత కూడా అతడితో సంప్రదింపులు కొనసాగించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. అతడి సూచన మేరకు.. అలీ అహ్సాన్ అనే వ్యక్తిని ఆమె కలిసింది. అతడు పాక్ నిఘా, రక్షణ విభాగాలకు చెందిన వ్యక్తులను జ్యోతికి పరిచయం చేసినట్లు సమాచారం.

దేశ రక్షణకు చెందిన అత్యంత సున్నితమైన సమాచారాన్ని ఆమె పాక్ వ్యక్తులకు చేరవేసినట్లు అధికారులు ఆరోపించారు. దీనిపై దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటికే ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను కూడా భారత్‌లో నిలిపివేశారు.




# ఇందిర సౌర గిరి జల వికాసం.. రైతులకు ఉచితంగా సోలార్ పంపుసెట్లు: సీఎం రేవంత్

అమ్రాబాద్: 'ఇందిర సౌర గిరి జల వికాసం' పథకంలో భాగంగా రైతులకు సోలార్ పంపుసెట్లు ఉచితంగా ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూరు ఐటీడీఏ పరిధిలోని అమ్రాబాద్ మండలం మాచారంలో ఈ పథకాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. రైతులకు 5, 7.5 హెచ్‌పీ పంపుసెట్లు ఇస్తామన్నారు. అచ్చంపేటను మోడల్ నియోజకవర్గంగా మారుస్తామన్నారు. ఈ నియోజకవర్గంలో వంద రోజుల్లో సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేస్తామన్నారు. విద్యుత్ పంపుసెట్ల స్థానంలో వీటిని బిగిస్తారని.. ఇందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సౌర విద్యుదుత్పత్తితో గిరిజనులు ఆదాయం పొందాలని సూచించారు. అచ్చంపేట నియోజకవర్గాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రంలో అటవీ హక్కుల చట్టం కింద 6.69 లక్షల ఎకరాల విస్తీర్ణానికి (2.30 లక్షల మంది ఎస్టీ రైతులకు) పోడుపట్టాలు మంజూరయ్యాయి. ఇందులో విద్యుత్తు సౌకర్యం లేని 6 లక్షల ఎకరాలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తారు. గిరిజన రైతుకు రెండున్నర ఎకరాల కన్నా ఎక్కువ భూమి ఉంటే సింగిల్ యూనిట్, అంతకు తక్కువగా ఉంటే.. సమీప రైతులను కలిపి బోర్‌వెల్ యూజర్ గ్రూపుగా ఏర్పాటు చేస్తారు. ఈ నెల 25 వరకు మండలాల వారీగా అర్హులైన ఎస్టీ రైతులను గుర్తించి, జూన్ 10 వరకు క్షేత్రస్థాయిలో పరిశీలన, భూగర్భ జలాల సర్వే తదితర పనుల్ని గిరిజన సంక్షేమశాఖ చేపడుతుంది. జూన్ 25 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు భూముల అభివృద్ధి, బోరుబావుల తవ్వకం, సోలార్ పంపుసెట్ల ఏర్పాటు తదితర పనుల్ని పూర్తి చేస్తారు. తొలి ఏడాదికి 10 వేల మంది రైతులకు చెందిన 27,184 ఎకరాలను సాగులోకి తీసుకువచ్చేందుకు దాదాపు రూ.600 కోట్లు ఖర్చుచేయనున్నారు.




# పాక్ ప్రజల దైన్యం.. ఆ దేశ సైన్యం..!

ఆ దేశంలో అత్యంత శక్తిమంతమైన మిలిటరీ తీరుపై వచ్చే విశ్లేషణలివి. స్వార్థపరులైన సైనికాధికారులు ఆ దేశాన్ని కబ్జా చేసి, నిలువునా లూటీ చేస్తున్న తీరుకు ఇది దర్పణం పడుతోంది. ఈ సేనానులు చేసే పోరాటం తక్కువ.. డబ్బు కోసం ఆరాటం ఎక్కువ! ఆయుధాలను పక్కనపెట్టేసి.. నయానో భయానో భూములను హస్తగతం చేసుకొని, వ్యాపార సామ్రాజ్యాలు నడుపుతూ వీరు సాగిస్తున్న దందాతో దేశం దివాళా అంచుకు చేరింది. ఈ జనరళ్లు కోట్లకు పడగలెత్తారు. పోరాటం చేసే బాధ్యతను ఉగ్రవాదులకు అప్పగించేసి రాజప్రాసాదాలను తలపించే భవనాల్లో విలాసాల్లో జోగుతున్నారు. మరోవైపు సాధారణ పాక్ ప్రజలు కనీస అవసరాలు తీరే దిక్కులేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. భారత్‌ను బూచిగా చూపుతూ పాకిస్థాన్‌ను అక్కడి సైన్యం కబంధ హస్తాల్లో బిగించింది. సైనిక ఉన్నతాధికారులు ఏళ్ల తరబడి ఆ దేశాన్ని ప్రత్యక్షంగా పాలించారు. మిగతా సమయంలోనూ వారిదే పెత్తనం. ప్రజాస్వామ్య ప్రభుత్వం అక్కడ నామమాత్రం.

**విలాపం...** దీర్ఘకాల రాజకీయ అనిశ్చితి, అస్తవ్యస్త ఆర్థిక నిర్వహణ కారణంగా పాకిస్థాన్ నలిగిపోతోంది. అధిక ధరలు, ఆర్థిక సంక్షోభం వల్ల సగటు పాక్ జాతీయుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. విదేశీ అప్పు 126 బిలియన్ డాలర్లు దాటిపోయింది. అప్పులు తీర్చడానికి దేశ బడ్జెట్‌లో 40 శాతం సొమ్ము సరిపోతోంది. ఆకలి సూచీలో పాక్ ఎక్కడో అట్టడుగున ఉంది. దేశ జనాభాలో దాదాపు 40 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు. బలోచిస్థాన్‌లో పరిస్థితి మరీ దారుణం. సహజవాయువు, ఖనిజాల ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు ఈ రాష్ట్రం తోడ్పాటును అందిస్తున్నప్పటికీ అక్కడ 70 శాతం మంది పేదరికంలో ఉన్నారు. ఇది వేర్పాటువాద ఉద్యమాలకు ఊతమిస్తోంది. పాక్‌లో గత కొన్నేళ్లుగా ఆర్థిక వృద్ధిరేటు 2.4 శాతానికే పరిమితమైంది. విదేశీ మారకనిల్వలు దారుణంగా పడిపోయాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ఇచ్చే ఉద్దీపన ప్యాకేజీలు, కొన్ని దేశాలు ఇస్తున్న రుణాలతో పాక్ నెట్టుకొస్తోంది.

**విలాసం..** దేశ ప్రజలు ఇన్ని ఇబ్బందుల్లో ఉంటే.. ఒక వ్యవస్థ ప్రస్థానం మాత్రం నిత్య కల్యాణం.. పచ్చతోరణంలా సాగిపోతోంది. అదే ఆ దేశ సైన్యం! ఇది ఒట్టి మిలిటరీ శక్తి మాత్రమే కాదు.. తిరుగులేని కార్పొరేట్ సంస్థ. రియల్ ఎస్టేట్, బ్యాంకింగ్, అగ్రిబిజినెస్, తయారీ, మీడియా, సరకుల రవాణా వంటి కీలక రంగాల్లో భారీగా ఆర్జిస్తోంది. ప్రత్యేక మినహాయింపులు, భూ ఆర్డినెన్స్‌ల ద్వారా ఈ దందాను చట్టబద్ధం చేసుకుంది. ఒక సమాంతర ఆర్థిక వ్యవస్థను నడుపుతోంది.

# కాళేశ్వరం ఆనకట్టల విచారణ కమిషన్ గడువు పొడిగింపు



హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించింది. మరో రెండు నెలలపాటు గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జులై నెలాఖరు వరకు గడువు పెంచుతున్నట్లు పేర్కొంది. ఇటీవల ఈ కమిషన్ విచారణను పూర్తి చేసింది. త్వరలోనే ప్రభుత్వానికి నివేదికను అందించనుంది.

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన లోపాలు, వైఫల్యాలపై గతేడాది నుంచి విచారణ జరిపింది. బ్యారేజీల డిజైన్, నిర్మాణం, నాణ్యత, నిర్వహణ అంశాలపై విచారించింది. సాంకేతిక, ఆర్థిక, విధానపరమైన అంశాలపై ఇంజినీర్లు, ఉన్నతాధికారులు, ఇతరులను ప్రశ్నించింది. వారి నుంచి అఫిడవిట్లు తీసుకొని వాటి ఆధారంగా క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది.

# అందాల పోటీలే కాదు.. అగ్ని ప్రమాదాల మీదా దృష్టిపెట్టాలి: కేటీఆర్



హైదరాబాద్: అందాల పోటీల మీదే కాదు.. అగ్ని ప్రమాదాల మీద కూడా దృష్టి పెట్టాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. అగ్ని ప్రమాదాల్లో మరో ప్రాణం పోకుండా ప్రభుత్వం చూడాలన్నారు. చార్మినార్ పరిధి గుల్జార్‌హౌజ్ సమీపంలో అగ్నిప్రమాదం జరిగిన భవనాన్ని ఆయన పరిశీలించారు. తాను రాజకీయంగా మాట్లాడటానికి ఇక్కడికి రాలేదని చెప్పారు. ప్రభుత్వాలు ప్రజల ప్రాణాలు కాపాడాలని పేర్కొన్నారు. "రూ.5 లక్షల పరిహారం ఇవ్వడం కాదు.. ప్రాణాలపై దృష్టిపెట్టాలి. మృతుల కుటుంబసభ్యులకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. ముఖ్యమంత్రే హోంమంత్రి కాబట్టి ఘటనా స్థలానికి వస్తే అధికారులు ఇంకా బాగా పనిచేస్తారు.

వేసవి కాలం వచ్చే ముందు అగ్నిమాపక సిబ్బందితో ప్రభుత్వం సమీక్ష సమావేశాలు నిర్వహించాలి. అగ్నిమాపక యంత్రాలు వచ్చాయి.. కానీ నీళ్లు లేవు. సిబ్బందికి సరైన మాస్కులు లేవని తెలిసింది. అంబులెన్స్‌లో ఆక్సిజన్ సిలిండర్ లేకపోవడం దురదృష్టకరం. హైదరాబాద్‌లో ఇదే అత్యంత భారీ అగ్ని ప్రమాదం. నిన్నటిరోజు దుర్భరమైన రోజు.. బాధితులు, మృతుల కుటుంబ సభ్యుల ఆవేదన వర్ణనాతీతం" అని కేటీఆర్ తెలిపారు.



# మరో నాలుగు రోజులపాటు వర్షాలు

హైదరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పాడిన ద్రోణి, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మరో నాలుగు రోజులపాటు తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. సోమ, మంగళవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు తెలిపింది. నేడు కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణ్‌పేట్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ, గద్వాల్ జిల్లాల్లో ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షాలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్లు పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాల్లో ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వర్షాల కారణంగా ఎండ తీవ్రత తగ్గనుంది. పగటిపూట ఉష్ణోగ్రతలు ఐదు డిగ్రీల మేర తగ్గే అవకాశముంది. బంగాళాఖాతం, అరేబియా సముద్రంలో నైరుతి రుతుపవనాలు మరింత వేగంగా విస్తరిస్తున్నాయి. రెండు మూడు రోజుల్లో దక్షిణ అరేబియా, మాల్దీవులు, కొమోరిన్ సహా బంగాళాఖాతంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయి. మరోవైపు మధ్య మహారాష్ట్ర సహా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ వరకు 0.9 కి.మీ ఎత్తులో ఓ ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఆగ్నేయ బంగాళాఖాతం నుంచి కోస్తాంధ్ర, రాయలసీమ మీదుగా కర్ణాటక వరకు మరో ద్రోణి కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రానున్న 24 గంటల్లో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో కొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. మరోవైపు అంచనా వేసిన సమయానికంటే ముందుగానే రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశమున్నట్లు భారత వాతావరణశాఖ వెల్లడించింది. ప్రస్తుతం అండమాన్ నికోబార్ దీవుల్లో రుతుపవనాలు పూర్తిగా విస్తరించి ఉన్నాయి. తొలుత ఈ నెల 27న కేరళ తీరాన్ని తాకుతాయని ఐఎండీ అంచనా వేసింది. అయితే, కాస్త ముందుగా 24నే కేరళ తీరంలోకి ప్రవేశించి, జూన్ మొదటి వారంలోనే తెలంగాణలోకి ప్రవేశించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com